RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 28 ఆగస్ట్ 2026 శుక్రవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:22 | సంచిక:78

# మిరాలం ట్యాంక్ను పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్ మిరాలం ట్యాంక్ను ప్రముఖ పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే ప్రణాళికలో భాగంగా సాగుతున్న పనులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆకస్మిక తనిఖీ చేశారు. అక్కడ సాగుతున్న పనులను ఒక్కొక్కటిగా పరిశీలించారు. అత్యుత్తమ డిజైన్లతో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. కొనసాగుతున్న పనులపై ఏర్పాటు చేసిన ఫోటో ప్రదర్శన ద్వారా అధికారులు వివరించారు. ప్రణాళికలను పూర్తిగా పరిశీలించిన తర్వాత ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. నిర్దేశిత గడువులోగా పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ట్యాంక్ చుట్టూ జరుగుతున్న అభివృద్ధి పనులను ఓపెన్–టాప్ జీపులో ప్రయాణించి ఆ ప్రాంతాన్ని మొత్తంగా పరిశీలించారు. మిరాలం చెరువుపై నిర్మిస్తున్న సస్పెన్షన్ బ్రిడ్జ్ పనులను భారీ క్రేన్ సహాయంతో పైకి వెళ్లి చూశారు. చెరువులోకి మురుగు నీరు చేరకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే చెరువు నుంచి మూసీలోకి వరద నీరు వెళ్లేలా నాలాను విస్తరించాలని చెప్పారు.

పర్యాటకులు చెరువులో వాటర్ స్పోర్ట్స్ కోసం డిజైన్ చేయాలని, చెరువు మధ్యలో ఉన్న ఐలాండ్లను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని చెప్పారు. అంతర్జాతీయ విమానాశ్రయానికి సమీపంలో ఉన్నందున మిరాలం చెరువును, పరిసర ప్రాంతాలను పర్యాటకులకు ఆకట్టుకునేలా ఏర్పాట్లు జరగాలని సూచించారు. ముఖ్యమంత్రి ఆకస్మిక పర్యటన సందర్భంగా మూసీ ర్రివర్ఫ్రంట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# బొగ్గు మైనింగ్ లో కలిసి నడుద్దాం

**కర్ణాటక జెన్కో క్యాప్టివ్ బొగ్గు గనులలో జాయింట్ వెంచరుగా పనిచేయడానికి సింగరేణి సిద్ధం**

**కర్ణాటక ఇంధన మంత్రికి ప్రతిపాదించిన తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**

**సానుకూలంగా స్పందించిన కర్ణాటక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ కె. జె. జార్జ్**



వార్తా 5 లో

## ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

వార్తా 2 లో



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి రాష్ట్రంలోని అక్కచెల్లెళ్ళకు శుభాకాంక్షలు తెలిపారు. అన్నాచెల్లెళ్ళ, అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకైన ఈ పండుగను అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంట్లో సుఖసంతోషాలు, ఆరోగ్యం వెల్లివిరియాలని అన్నారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, ఆడబిడ్డలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రజా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే బృహత్ సంకల్పంలో భాగంగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తోందని సీఎం తెలిపారు.

# గవర్నర్ ను పరామర్శించిన సీఎం రేవంత్



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్ అనారోగ్యంతో హై టెక్ సిటీ యశోదా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ను సీఎం రేవంత్ రెడ్డి గురువారం పరామర్శించారు. అయన వెంట ,ఎంపీ వేం నరేందర్ రెడ్డి తదతరులున్నారు..

## ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

- 20వ గ్రాండ్ నర్సరీ మేళాను ప్రారంభించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- హరిత వాతావరణం ప్రోత్సహించడంలో అందరం భాగస్వాములు కావాలి: మంత్రి తుమ్మల
- ఐదు రోజులపాటు ఆల్ ఇండియా హార్టికల్చర్& అగ్రికల్చర్ షో



హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్: ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్లోని ఐమ్యాక్స్ థియేటర్ పక్కన హెచ్ఎండీఏ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన 20వ గ్రాండ్ నర్సరీ మేళా – – ఆల్ ఇండియా హార్టికల్చర్ ఔ అగ్రికల్చర్ షోను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు.

మిగతా 2 లో

# తెలంగాణలో భారీగా ఆధునిక ధాన్య సైలోలు

**నిర్మాణం నుంచి నిర్వహణ వరకు మహిళా స్వయం సహాయక సంఘాలకు కీలక భాగస్వామ్యం**

**అదనంగా 5 నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ నిల్వ సామర్థ్యం లక్ష్యం**

**పెరుగుతున్న వరి ఉత్పత్తి, ధాన్యం సేకరణకు అనుగుణంగా శాశ్వత నిల్వ వ్యవస్థ**

**ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్ నుంచి డిజిటల్ మానిటరింగ్ వరకు అత్యాధునిక సాంకేతికత**

**బియ్యం మిల్లర్ల నుంచి బకాయిల వసూలుకు పటిష్ట కార్యాచరణ**

**జీఈఎం, తెలంగాణ ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా పారదర్శకంగా ధాన్యం వేలం**

**--- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి**



హైదరాబాద్, ఆగస్టు 27:తెలంగాణలో ఏటేటా విస్తరిస్తున్న వరి సాగు, గణనీయంగా పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, ప్రభుత్వ సేకరణ అవసరాలకు దీర్ఘకాలిక పరిష్కారంగా అత్యాధునిక ధాన్య సైలోల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిక రూపొందించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు. రాష్ట్రంలో అదనంగా 5 లక్షల నుంచి 10 లక్షల మెట్రిక్ టన్నుల శాస్త్రీయ ధాన్య నిల్వ సామర్థ్యాన్ని సృష్టించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు.ముఖ్యంగా ఈ సైలోల నిర్మాణం, నిర్వహణలో మహిళా స్వయం సహాయక సంఘాలను (SHGs) పెద్ద ఎత్తున భాగస్వాములను చేయాలని మంత్రి సూచించారు. మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు కొత్త మార్గాలను తెరవడంతో పాటు, రాష్ట్ర ఆహార భద్రతకు అవసరమైన శాశ్వత మౌలిక సదుపాయాల నిర్మాణంలో వారిని భాగస్వాములను చేసే నమూనాలను పరిశీలించాలని అధికారులకు సూచించారు.

మిగతా 5 లో

# నేపాల్ వరదల్లో 288 మంది భారతీయులు గల్లంతు: విదేశాంగ శాఖ

**తమిళనాడుకు చెందిన 21 మందిని సురక్షితంగా కాపాడిన అధికారులు**

**టిబెట్లోనూ 200 మంది భారతీయుల సహాయ అభ్యర్థన**

**నేపాల్ అధికారులతో భారత రాయబార కార్యాలయం సంప్రదింపులు**

పొరుగు దేశం నేపాల్లో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా 288 మంది భారతీయులు గల్లంతయ్యారని భారత విదేశాంగ శాఖ (ఎంఈఏ) గురువారం వెల్లడించింది. ఈ ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన విదేశాంగ శాఖ, సహాయక చర్యల నిమిత్తం నేపాల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నట్లు తెలిపింది.

విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ఇప్పటివరకు 21 మంది భారతీయులను సురక్షితంగా రక్షించినట్లు తెలిపారు. బాధితులంతా తమిళనాడుకు చెందిన వారని ఆయన స్పష్టం చేశారు.



గల్లంతైన వారి ఆచూకీ కనిపెట్టేందుకు నేపాల్లోని భారత రాయబార కార్యాలయం స్థానిక అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతోందని ఆయన వివరించారు.

ఇదిలా ఉండగా, టిబెట్లో చిక్కుకున్న సుమారు 200 మంది భారతీయులు సైతం సహాయం కోసం విజ్ఞప్తి చేసినట్లు జైస్వాల్ వెల్లడించారు. వారిని సురక్షితంగా తరలించేందుకు అవసరమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గల్లంతైన వారి గురించి మరిన్ని వివరాలు సేకరిస్తున్నామని, సహాయక చర్యలను మరింత ముమ్మరం చేసినట్లు విదేశాంగ శాఖ పేర్కొంది.

ప్రజాబలం

28 ఆగస్ట్ 2026 శుక్రవారం

# దారి తప్పుతున్న టీనేజ్...

పాఠశాల గేటు దాటే పిల్లల చేతుల్లో పుస్తకాలు, పెన్నులు ఉండాలి. పరీక్షల గురించి ఆలోచిస్తూ, ఆటల గురించి మాట్లాడుకుంటూ, స్నేహితులతో నవ్వుకుంటూ ఇంటికి తిరిగి రావాలి. కానీ అదే పిల్లల చేతుల్లో హత్యాయుధాలు కనిపిస్తున్నాయి. ఉపాధ్యాయులపై, తోటి విద్యార్థులపై దాడులు, డ్రగ్స్.. ఇవన్నీ పాఠశాల వయసు పిల్లల చుట్టూ విని పిస్తున్నప్పుడు "పిల్లలు చెడిపోతున్నారు" అని చెప్పి ముందుకు వెళ్లిపోవడం సరిపోదు..నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో పాఠశాల ప్రిన్సిపాల్ హత్యకు సంబంధించిన ఘటనలో పదో తరగతి విద్యార్థుల ప్రమేయం ఉందన్న విషయం ఈ ఆందోళనను మరింత పెంచింది. కూకట్‌పల్లిలో తోటి విద్యార్థిపై దాడి, నిజామాబాద్‌లో విద్యార్థినిపై లైంగిక దాడికి సంబంధించిన ఘటనలు కూడా సమాజాన్ని కలవరపెడుతున్నాయి.. ఇవి కేవలం పోలీసు కేసులు కావు.. ఇవి మన విద్యా వ్యవస్థకు, కుటుంబ వ్యవస్థకు, సమాజానికి ఎదురవుతున్న ప్రశ్నలు..ఏ పిల్లవాడూ పుట్టుకతో నేరస్తుడు కాదు. ఒక పిల్లవాడు హింసాత్మకంగా మారడం వెనుక ఇంటి పరిస్థితులు, పాఠశాల లో వేధింపులు, స్నేహితుల ఒత్తిడి, మానసిక ఒత్తిడి, సోషల్ మీడియా, సినిమాలు, డ్రగ్స్, గ్యాంగ్ సంస్కృతి వంటి అనేక ప్రభావాలు ఉండవచ్చు. పిల్లవాడు అకస్మాత్తుగా ఎక్కువగా కోప్పడటం, వస్తువులు పగలగొట్టడం, తల్లిదండ్రులతో మాట్లా డటం తగ్గించడం, పాఠశాలకు వెళ్లడానికి ఇష్టపడక పోవడం, స్నేహితులను మార్చుకోవడం, ఒంటరిగా ఉండటం, హింసాత్మక వీడియోలపై ఆసక్తి చూపించడం, బెదిరింపు భాష ఉపయోగించడం వంటి మార్పులు కనిపిస్తే వెంటనే అతడిని నేరస్తుడిగా ముద్ర వేయాల్సిన అవసరం లేదు. మన సమా జంలో పిల్లవాడు తప్పు చేసిన తర్వాత స్పందిస్తాం. కానీ అతను తప్పు చేసే దిశగా వెళ్తున్నప్పుడు మాత్రం గమనించం.స్మార్ట్‌ఫోన్, సినిమాలు, వెబ్‌సిరీస్‌లు, సోషల్ మీడియా పిల్లలకు జ్ఞానం, వినోదాన్ని అందించే సాధనాలే.. కానీ అదే సమయంలో హింస, సైబర్ బుల్లీయింగ్, డ్రగ్స్, గ్యాంగ్ కల్చర్, నేరాలను గొప్పగా చూపించే కంటెంట్ కూడా వారి ముందుకు వస్తోంది. హింసను హీరోయిజంగా, ప్రతీకారాన్ని గొప్పగా, నేరాన్ని స్టైల్‌గా చూపించే దృశ్యాలను పిల్లలు పదేపదే చూస్తున్నారు.. కొన్ని సెకన్ల షార్ట్ వీడియోల కోసం గంటల తరబడి ఫోన్‌లో గడుపుతూ, పక్కనే ఉన్న తల్లిదండ్రులతో పది నిమిషాలు మాట్లాడలేని పరిస్థితి కూడా ఏర్పడుతోంది. అయితే పిల్లల ప్రవర్తనకు ఫోన్, సినిమాలనే పూర్తిగా కారణంగా చూపడం కూడా సరైంది కాదు. సమస్య సాధ నాల్లో కంటే వాటిని పిల్లలు ఎలా ఉపయోగిస్తున్నారు, వారు చూస్తున్న కంటెంట్‌ను ఎలా అర్థం చేసుకుంటున్నారనే దాంట్లో ఉంది. అందుకే తల్లిదండ్రులు ఫోన్ లాక్కోవడం లేదా సినిమాలను నిందించడం మాత్రమే కాకుండా పిల్లలతో కలిసి కంటెంట్ గురించి మాట్లాడాలి.ఇప్పటి తల్లిదండ్రులకు మంచి పాఠశాలలో చదివించడం, సౌకర్యాలు కల్పించడం, ఖరీదైన ఫోన్ కొనివ్వడం తెలుసు.. కానీ పిల్లలతో ప్రశాంతంగా కూర్చొని మాట్లాడటానికి సమయం లేకపోవడం పెద్ద సమస్య. చదివావా ఎన్ని మార్కులు వస్తాయని అడగడం మాత్రమే కాదు. ఎలా ఉన్నావు.. ఏమైనా సమస్య ఉందా? ఎవరైనా ఇబ్బంది పెడుతున్నారా అని కూడా అడగాలి. పిల్లల చేతిలో ఫోన్ ఉందా లేదా అనేది మాత్రమే చూడటం కాదు. ఆ ఫోన్ కంటే ముందు వారి మనసులో ఏం జరుగుతుందో చూడాలి. పిల్లల నేరాలను కేవలం పోలీసుల సమస్యగా చూడలేం. ఇది కుటుం బం, పాఠశాల, ప్రభుత్వం, మీడియా, సినిమా, సోషల్ మీడి యా, సమాజం.. అందరి బాధ్యత. నేరం జరిగిన తర్వాత శిక్షిం చడం అవసరం. కానీ అంతకంటే ముఖ్యమైనది నేరం జరిగే పరిస్థితులను ముందే గుర్తించడం. పిల్లల చేతుల్లో కత్తులు వచ్చిన తర్వాత మార్చడం కంటే, ఆ కత్తి అవసరం అనిపించని బాల్యాన్ని నిర్మించడం మన అసలు లక్ష్యం కావాలి.నవ మాసాలు మోసి, కని, పెంచి, పెద్ద చేసి, తమ పిల్లలు ప్రయోజకులై ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రతి తల్లిదండ్రి కలలు కంటారు.. అయితే పిల్లలను పెంచడం మాత్రమే కాకుండా, వారిని సన్మార్గంలో నడిపించడం కూడా తల్లిదండ్రుల గురుతరమైన బాధ్యత. ముఖ్యంగా ప్రస్తుత కాలంలో సెల్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం పిల్లలపై తీవ్రంగా పడుతున్న నేపథ్యంలో, వారు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పిల్లల నడవడికను, వారి ఆలోచనా విధానాన్ని, స్నేహ సంబంధాలను, సామాజిక మాధ్యమాల వినియోగాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ, వారికి సరైన మార్గదర్శకత్వం అందించాలి. అంతేకాకుండా పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ప్రేమ, సమాజం పట్ల బాధ్యత వంటి సద్గుణాలను అలవర్చాలి. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమైనది.ఏ లక్ష్యం కోసం అయితే, ఏ ఆశయం కోసం అయితే విద్యార్థులు మన చెంతకు చేరుతున్నారో, వారి ఆశయాలను నెరవేర్చడానికి గురువులుగా అంకితభావంతో పనిచేయవలసిన గురుతర బాధ్యత ప్రతి ఒక్క ఉపాధ్యా యుడిపై ఉంది. విద్యార్థులను తమ సొంత పిల్లలుగా భావించి, వారి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పాటునందించాలి. విద్యార్థులలో క్రమశిక్షణ లోపించకుండా, చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు ప్రతి పిల్లవాడిని తీర్చిదిద్ద వలసిన బాధ్యత అందరిపై ఉంది. 'కొందరు చేస్తారు – మేము మాత్రం చూస్తాం' అనే కొందరి ఉపాధ్యాయుల బాధ్యతారాహిత్యం వలన మొత్తం ఉపా ధ్యాయ లోకం అభాసుపాలు అయ్యే అవకాశం ఉంది. కావున పిల్లలలో క్రమశిక్షణను పెంపొందించడంలో ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరం తప్పనిసరి.విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండేటట్లు, క్రమశిక్షణ పొంపొందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. విద్యాలయాలకు కిలోమీటర్ దూరంగా ఎలాంటి మత్తు పదార్థాలనుగాని ఇతర ధూమపాన వస్తువులను విక్రయించకుండా నిషేధించాలి. ఒకవేళ అనధికారికంగా మత్తు పదార్థాలను విక్రయించే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. క్రమశిక్షణ లోపించిన విద్యార్థులలో, క్రమశిక్షణ పెంపొందించడానికి కౌన్సిలింగ్ సెంట ర్లను ఏర్పాటు చేయాలి. ఏది ఏమైనప్పటికీ ఆధునిక కాలంలో కూడా విద్యార్థులలో సన్నగిల్లుతున్న క్రమశిక్షణను దారిలో పెట్టడానికి, తల్లిదండ్రులు, గురువులు, ప్రభుత్వం, సమాజ భాగస్వామ్యంతో కలిసి విద్యార్థులలో విలువలతో కూడిన విద్యను అందించి, వారిలో సత్ప్రవర్తనను పెంపొందించేటట్లు చూడాలి.

# ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలి

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి** హైదరాబాద్, ఆగస్టు 27: హైదరాబాద్ నగరం, ఔటర్ రింగ్ రోడ్డు (ORR) పరిధిలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడం, రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రధాన కార్యదర్శి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై విస్తృతంగా సమీక్షించారు.ఈ సందర్భంగా రోడ్డు భద్రత, ట్రాఫిక్ సిగ్నళ్ల నిర్వహణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, అత్యవసర సేవలకు వేగవంతమైన మార్గాల కల్పన తదితర అంశాలపై చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రధాన నగరాలు, జిల్లా కేంద్రాలు, మున్సిపాలిటీలు, పట్టణ ప్రాంతాలు, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని సూచించారు.రోడ్డు ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీస్, రవాణా తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాలని, ఇందుకు సంబంధించిన డీపీఆర్‌ను వీలైనంత త్వరగా సిద్ధం చేయాలని సీఎస్ ఆదేశించారు. నవంబర్, డిసెంబర్ నాటికి అవసరమైన ప్రాంతాల్లో సిగ్నలింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



### శాఖల మధ్య సమన్వయం

నార్కోటిక్ బ్యూరో, TG-SAFE తరహాలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత కోసం TG-TMARS (Traffic Management and Road Safety) పేరుతో ప్రత్యేక, స్వతంత్ర వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సిగ్నలింగ్ వ్యవస్థను ఆధునీకరించడంతో పాటు ఎలక్ట్రానిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత పటిష్టం చేయాలని, సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా రోడ్డు భద్రతా చర్యలు చేపట్టాలని సీఎస్ ఆదేశించారు. ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను నిరోధించేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రస్తుతం 429 ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థలు ఉన్నాయని, వీటిలో అధునాతన సిగ్నల్ నియంత్రణ వ్యవస్థలను వినియోగిస్తున్నట్లు అధికారులు సీఎస్‌కు వివరించారు.

ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత ఒకే శాఖకు పరిమితమైన అంశాలు కావని, పోలీస్, రవాణా, రోడ్లు–భవనాలు, మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి తదితర శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని సీఎస్ పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి సంబంధించిన ట్రాఫిక్ డేటాను సమీకరించి, ఒకే వేదికపై విశ్లేషించేందుకు ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ డేటా ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణను మరింత సమర్థవంతంగా, సురక్షితంగా మార్చేందుకు కృత్రిమ మేధస్సు (AI) ఆధారిత సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎస్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగం కేవలం ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించడానికే పరిమితం కాకుండా, ప్రజలకు సురక్షితమైన, వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించేలా ఉండాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలను గుర్తించేందుకు డేటా ఆధారిత, సాంకేతికత ఆధారిత, ప్రజా ప్రయోజనకరమైన విధానాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.రాష్ట్రవ్యాప్తంగా AI ఆధారిత ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతకు సంబంధించి అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అధ్యయనం చేసి, అవసరమైన ప్రాంతాల్లో పైలట్ ప్రాజెక్టులను చేపట్టాలని సూచించారు. పైలట్ ప్రాజెక్టుల ఫలితాల ఆధారంగా వాటిని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకోవాలని సమావేశంలో నిర్ణయించారు.ఈ సమావేశంలో డీజీపీ సి.వి. ఆనంద్, రవాణా, రోడ్లు–భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ వి.సి. సజ్జనార్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాలి

మొదటి పేజీ తరువాయి

అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన స్టాల్స్ ని పరిశీలించిన మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. 2015 సంవత్సరం నుంచి ప్రతి ఏడాది జనవరి, ఆగస్టు నెలల్లో క్రమం తప్పకుండా నర్సరీ మేళాను నిర్వహించడం అభినందనీయమని మంత్రి అన్నారు. ప్రజలకు వివిధ రకాల మొక్కలను ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి ఈ మేళా మంచి అవకాశంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

ఆగస్టు 27 నుంచి 31వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జరగనున్న ఈ మేళాలో 110కి పైగా స్టాల్స్ ఏర్పాటు చేశారు. దేశవ్యాప్తంగా వివిధ నర్సరీల నుంచి తీసుకొచ్చిన అనేక రకాల మొక్కలను ప్రజలకు అందుబాటులో ఉంచారు. టెర్రస్ గార్డెనింగ్, వెర్టికల్ గార్డెనింగ్, హైడ్రోపోనిక్ గార్డెనింగ్‌కు అవసరమైన మొక్కలతో పాటు పూల మొక్కలు, మెడిసినల్ ప్లాంట్స్, బోన్సాయి, అలంకరణ మొక్కలు వంటి విభిన్న రకాల మొక్కలు మేళాలో అందుబాటులో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్, కోల్కతాతో పాటు ఢిల్లీ, హర్యానా, గుజరాత్, ముంబయి, బెంగళూరు, పూణే, షిర్డీ, చెన్నై, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి మొక్కలను తీసుకొచ్చారు. నాగాలాండ్ నుంచి వచ్చిన కాక్టస్ వంటి ప్రత్యేక ఆకర్షణ కలిగిన మొక్కలు కూడా మేళాలో ఉన్నాయని వివరించారు.

సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా రూ.20 నుంచి రూ.2.5 లక్షల విలువైన మొక్కల వరకు వివిధ రకాల మొక్కలు మేళాలో లభిస్తున్నాయని మంత్రి తెలిపారు. మొక్కల పెంపకానికి అవసరమైన మెటీరియల్స్, ఆర్గానిక్ ఎరువులు, ఫెర్టిలైజర్లు, టెర్రకోట కుండీలు తదితర సామగ్రి కూడా ఒకే చోట లభించడం మేళా ప్రత్యేకతగా పేర్కొన్నారు.

దేశంలోని వివిధ ప్రాంతాల్లో లభించే అరుదైన, ప్రత్యేకమైన మొక్కలను హైదరాబాద్ నగర ప్రజలకు ఒకే వేదికపై అందుబాటులోకి తీసుకురావడం గొప్ప విషయమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రతి ఇంటిలో మొక్కలు పెంచే సంస్కృతిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. మొక్కలు ఇంటి అందాన్ని పెంచడమే కాకుండా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందిస్తాయని మంత్రి తెలిపారు. ఇంటి ఆవరణలో మొక్కలు పెంచడం ద్వారా ఒత్తిడి తగ్గి మానసిక ఉల్లాసం కలుగుతుందని, ఇంటి పరిసరాల్లో చల్లని వాతావరణం ఏర్పడటానికి కూడా మొక్కలు దోహదపడతాయని అన్నారు.

మొక్కల పెంపకాన్ని అలవాటుగా చేసుకోవడం ద్వారా సమయాన్ని సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చని మంత్రి పేర్కొన్నారు. నగర జీవనంలో పెరుగుతున్న ఒత్తిడి, కాలుష్యం నేపథ్యంలో హరిత వాతావరణాన్ని పెంచుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ మేళా ద్వారా ప్రజలకు మొక్కలపై అవగాహన పెరగడంతో పాటు ఇంటి స్థాయిలో గార్డెనింగ్‌ను ప్రోత్సహించడానికి మంచి అవకాశం లభిస్తుందని మంత్రి అన్నారు. హైదరాబాద్ నగర వాసులందరూ ఈ ఐదు రోజుల నర్సరీ మేళాను సందర్శించి, తమకు నచ్చిన మొక్కలను కొనుగోలు చేసి తమ ఇళ్లను మరింత పచ్చదనంతో నింపాలని కోరారు.






**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:**గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గం హిందీనగర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గ్రామసభ గోషామహల్ అసెంబ్లీ నియోజక వర్గ ఈఆర్‌వో జీ.ఉమాప్రకాష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. దత్తాత్రేయనగర్ వార్డ్ ఆఫీస్‌లో ఎఈఆర్‌వో విజయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమంలో జాంబాగ్ డివిజన్ ఎగ్జిబిషన్ గ్రౌండ్ డివిజన్ దత్తాత్రేయ నగర్ డివిజన్ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సర్‌కోఆర్డినేటర్ గోషామహల్ నియోజకవర్గం ఇంఛార్జ్ డి.వెంకట్‌రాజ్ , ఖైరతాబాద్ జిల్లా కార్యదర్శి ఎస్ .ధన్‌రాజ్ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆరీఫ్ షా మొహమ్మద్ ,జాంబాగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దాసరి రాజ్ కుమర్ , ఎగ్జిబిషన్ గ్రౌండ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ జిత్తు ,ఇష్ఫాకార్ ,ఖాదర్, యోగీ ,జయ్ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

# ములుగు జిల్లాను అభివృద్ధి వెలుగులతో విరాజిల్లేలా కృషి చేయాలి.

# మంత్రి దనసరి అనసూయ సీతక్క.





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 కలెక్టరేట్**గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావుతో కలిసి ఇంజనీరింగ్ శాఖల పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సీతక్క సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా నీటిపారుదల, రహదారులు--భవనాలు, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, గ్రామీణ నీటిసరఫరా, జాతీయ రహదారులు, గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్, మిషన్ భగీరథ, తెలంగాణ వైద్య సేవలు--మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, విద్యా--సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖల పరిధిలో కొనసాగుతున్న పనులను శాఖలవారీగా సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టాల్సిన నూతన అభివృద్ధి పనులను గుర్తించి, సంబంధిత ప్రాజెక్టులకు సమగ్ర అంచనాలతో కూడిన ప్రతిపాదనలు సిద్ధం చేసి అందజేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనుల పురోగతికి సంబంధించిన వివరాలను శాఖలవారీగా నమోదు చేయాలని సూచించారు.

అభివృద్ధి పనుల అమలులో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులు, పనులను సకాలంలో పూర్తి చేయని గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమీక్ష సమావేశానికి గైర్హాజరైన అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

రామప్ప--లక్నవరం గ్రావిటీ కెనాల్‌కు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. దేవాదుల ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలను నిరంతరం రామప్ప సరస్సుకు తరలించే సాధ్యాసాధ్యాలను వెంటనే పరిశీలించాలని సూచించారు. రామప్ప సరస్సు నుంచి ములుగు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లకు నీటిని తరలించేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలను రూపొందించాలన్నారు.

రామప్ప ప్రాంతంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతోపాటు నూతన పర్యాటక అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మేడారం జాతర ప్రాంతంలో జంపన్నవాగు సుందరీకరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని సూచించారు. మేడారంలో నూతనంగా నిర్మించనున్న అతిథిగృహాన్ని రెడ్డిగూడెం ప్రాంతంలోని గుట్టపై నిర్మించే అవకాశాలను పరిశీలించాలన్నారు.

మేడారం రింగ్‌రోడ్డు ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించి, అవసరమైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి పుష్కర ఘాట్ వరకు రహదారి నిర్మాణ పనులు చేపట్టాలని, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు.

జిల్లాలో కొనసాగుతున్న రహదారుల అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. స్టేడియం నిర్మాణ పనుల్లో వేగం పెంచి త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. మల్లూరు ప్రాంతంలో నూతన మౌలిక సదుపాయాల కల్పనకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల, నర్సింగ్ కళాశాలతోపాటు జిల్లాలో కొనసాగుతున్న ఇతర భవన నిర్మాణ పనులను నిర్ణీత సమయంలో, నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అధికారులు విధి నిర్వహణను బాధ్యతగా భావిస్తూ ఉత్తమ పనితీరుతో ప్రజల ప్రశంసలు పొందాలని మంత్రి సూచించారు.

అనంతరం మంత్రి సీతక్క మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ, జిల్లాలోని పాఠశాల భవనాల నిర్మాణ పురోగతిపై సమీక్షించినట్లు తెలిపారు. అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనులన్నింటినీ నిర్దిష్ట కాలపరిమితిలో పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు.

గోదావరి జలాలు ఈ ప్రాంతం నుంచి అనేక ప్రాంతాలకు తరలిపోతున్నప్పటికీ, స్థానికంగా సాగునీటి సౌకర్యాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదేశాలతో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల కోసం సుమారు రూ.200 కోట్లు మంజూరు చేసినట్లు వెల్లడించారు.

రామప్ప--లక్నవరం అనుసంధాన పనులు, పొట్లాపూర్ ఎత్తిపోతల పథకం, రామచంద్రాపురం--మల్లంపల్లి ప్రాంతాల్లో కొనసాగుతున్న, చేపట్టబోయే పనుల పురోగతితోపాటు వాటికి అవసరమైన భూసేకరణ ప్రక్రియపై సమీక్షించినట్లు తెలిపారు.

రామప్ప సరస్సును నింపడం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూములు ముంపునకు గురవుతున్న నేపథ్యంలో అవసరమైన భూసేకరణ చేపట్టి, బాధిత రైతులకు నష్టపరిహారం చెల్లించేలా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

నీటిపారుదల శాఖ పరిధిలో అవసరమైన ఘాట్ల నిర్మాణంతోపాటు పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అభివృద్ధి పనుల పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్షలు నిర్వహించాలని సూచించినట్లు వెల్లడించారు.

కొన్ని కార్యాలయాల్లో అధికారులు సక్రమంగా విధులకు హాజరుకాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైతే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు మంత్రి సీతక్క తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్, సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, ఆత్మ కమిటీ డివిజన్ చైర్మన్ రవీందర్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సోదర భావానికి ప్రతీక రాఖీ పండుగ.

### రాష్ట్ర ప్రజలకు రాఖీ పండుగ శుభాకాంక్షలు.

### జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టిన మంత్రి దనసరి అనసూయ సీతక్క.

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 ములుగు** గురువారం ములుగులోని నూతన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో రాఖీ పండుగను పురస్కరించుకొని ముందస్తుగా మంత్రి సీతక్క



జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లకు రాఖీలు కట్టారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క రాష్ట్ర ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరసోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు, అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పండుగను ప్రతి కుటుంబం ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## పట్టణ ప్రాంతాలతో సమానంగా విలీన గ్రామాలను అభివృద్ధి

### రూ.8 కోట్ల 50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన మంత్రి దనసరి అనసూయ సీతక్క

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 బండారుపల్లి**గురువారం పురపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ములుగు పురపాలక సంఘం నిధులతో విలీన గ్రామాల్లో చేపట్టనున్న రూ.8 కోట్ల 50 లక్షల అభివృద్ధి పనులకు మంత్రి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు.

బండారుపల్లి గ్రామంలో రూ.5 కోట్ల 50 లక్షలు, జీవంతరావుపల్లి గ్రామంలో రూ.3 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు మంత్రి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ ములుగు మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాల్లో ప్రజల అవసరాలకు అనుగుణంగా అంతర్గత రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

విలీన గ్రామాల ప్రజలకు పట్టణ స్థాయి సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, నిర్ణీత గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు



అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, గుత్తేదారులను మంత్రి ఆదేశించారు. పనుల పురోగతిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ములుగు మున్సిపాలిటీ చైర్పర్సన్ చింతనిప్పుల చంద్రకళ,స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ప్రయోగాలతో సైన్స్ నేర్చుకునేలా ప్రగతి కేంద్రం



**జహీరాబాద్, ఆగస్టు 27 ప్రజా బలం ప్రతినిధి:** విద్యార్థులు సైన్స్ పాఠ్యాంశాలను బట్టీ పట్టకుండా ఆసక్తిగా, ప్రయోగాత్మకంగా నేర్చుకునేందుకు ప్రగతి సైన్స్ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రముఖ సామాజికవేత్త, మాజీ కలెక్టర్ జయప్రకాష్ నారాయణ అన్నారు. దత్తగిరి కాలనీలోని ప్రగతి నర్సింగ్‌హోమ్ ఆవరణలో



ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రగతి సైన్స్ సెంటర్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు భౌతిక, రసాయన, జీవశాస్త్రాలకు సంబంధించిన పాఠ్యాంశాలను ప్రయోగాత్మకంగా నేర్చుకునేందుకు అవసరమైన పరికరాలు, రసాయనాలను కేంద్రంలో అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం హౌసింగ్ బోర్డు కాలనీలో మున్సిపల్ చెత్త సేకరణ కార్మికుల పిల్లల కోసం నిర్వహిస్తున్న బోధనా కేంద్రాన్ని జయప్రకాష్ నారాయణ సందర్శించి నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ జైపాల్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ శిరీషారెడ్డి, ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ డా. ఎ. విజయలక్ష్మి, నిర్వాహకులు డా. కె. శివబాబు, జగన్నాథరావు, శ్రీరామ్, ఉపాధ్యాయులు రామచంద్రయ్య, షేక్ వలి, దీపక్, సంఘవి, యూసుఫ్, ఫయాజ్, సువర్ణ, కోస్గి లక్ష్మితో పాటు పలువురు విద్యాసంస్థల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక పాలనకు కేంద్ర బిందువులు గా గ్రామపంచాయతీలు

### మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 బండారుపల్లి** గురువారం ములుగు మండలంలో నూతనంగా ఏర్పాటైన బంజరుపల్లి గ్రామపంచాయతీకి ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన నూతన కార్యాలయ భవనాన్ని మంత్రి దనసరి అనసూయ సీతక్క ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులను అభివృద్ధి చేయడంతోపాటు పాలనను ప్రజలకు మరింత చేరువ చేయడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గ్రామపంచాయతీ కార్యాలయాల ద్వారా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామస్థుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని, వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి



**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27:** గ్రామాల్లో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సూచించారు.




గురువారం సత్తుపల్లి మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ప్రభుత్వ అధికారులు, అన్ని గ్రామాల సర్పంచులతో ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల వారీగా అభివృద్ధి పనులు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై సమీక్షించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంకా పరిష్కారం కాని సమస్యలను సర్పంచులు వెంటనే సంబంధిత ప్రభుత్వ అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజా సమస్యలపై అధికారులు, సర్పంచులు ప్రత్యేక శ్రద్ధ వహించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచులు, ఉప సర్పంచులు, అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి మరింత వేగవంతమవుతుందని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి చేరేలా అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పథకాలకు అర్హత ఉన్నప్పటికీ లబ్ధి పొందని వారు ఎవరైనా ఉంటే వారి వివరాలను గుర్తించి ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా ప్రతి 45 రోజులకు ఒకసారి సత్తుపల్లి నియోజకవర్గంలోని ప్రతి మండలంలో ప్రభుత్వ అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఈ సమావేశంలో సత్తుపల్లి వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలి: భాస్కర్ణి వీరంరాజు

## టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్రకు బీజేపీ నేత సంఘీభావం




**సత్తుపల్లి, ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27:** ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలుస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకొస్తున్న జర్నలిస్టులకు సొంత ఇళ్లు, ఇళ్ల స్థలాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని బీజేపీ ఖమ్మం జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్ణి వీరంరాజు అన్నారు.

జర్నలిస్టులకు ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర వేంసూరుకు చేరుకున్న సందర్భంగా భాస్కర్ణి వీరంరాజు పాదయాత్రలో పాల్గొని సంపూర్ణ సంఘీభావం తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉత్తమ విద్యార్థిని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుడు ఎంత కీలక పాత్ర పోషిస్తారో, మెరుగైన సమాజ నిర్మాణంలో జర్నలిస్టులు అంతే కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి రాష్ట్ర స్థాయి వరకు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి, వాటిపై ప్రజా చర్చకు దారితీస్తూ పరిష్కారాలకు జర్నలిస్టులు వారధిగా నిలుస్తున్నారని పేర్కొన్నారు.

ప్రజల సమస్యలపై నిత్యం ప్రశ్నించే జర్నలిస్టులే నేడు తమ కుటుంబాల కోసం సొంత ఇల్లు, ఇళ్ల స్థలం లేక అద్దె ఇళ్లలో జీవించాల్సిన పరిస్థితి ఉండటం బాధాకరమన్నారు. ప్రజల గోడును ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టుల సమస్యలను మాత్రం పట్టించుకోకపోవడం సమంజసం కాదని ప్రశ్నించారు.

తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంతో పాటు రాష్ట్ర నిర్మాణంలో జర్నలిస్టులు పోషించిన పాత్రను విస్మరించలేమన్నారు. గత ప్రభుత్వాలు జర్నలిస్టుల సంక్షేమంపై పలు హామీలు ఇచ్చినా అవి పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోకపోవడం విచారకరమన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టుల సమస్యలను పక్కన పెట్టడం సరికాదని అన్నారు.

ఇప్పటికైనా ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించి అర్హులైన జర్నలిస్టులను గుర్తించి వారికి ఇళ్లు, ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి సమగ్ర విధానాన్ని ప్రకటించాలని కోరారు.

జర్నలిస్టులు తమ న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి బీజేపీ పూర్తి మద్దతుగా నిలుస్తుందని, వారి డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ప్రజా ఉద్యమాలకు అండగా ఉంటామని భాస్కర్ణి వీరంరాజు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ వేంసూరు మండల యువమోర్చా అధ్యక్షులు ధూపాటి వంశీతో పాటు పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని టీడబ్ల్యూజేఎఫ్ పాదయాత్రకు సంఘీభావం తెలిపారు.

## జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని'

అమరావతి :నూతన సంవత్సరం కానుకగా జనవరి 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'సంజీవని' ప్రాజెక్టును అమలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. కుప్పం, చిత్తూరు జిల్లాల్లో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు సత్ఫలితాలనిచ్చిన నేపథ్యంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆరోగ్య సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు 90 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. బుధవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో 'సంజీవని ప్రాజెక్ట్' అమలుపై ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.ముందస్తు వ్యాధి నిర్ధారణే ధ్యేయంప్రతి కుటుంబంపై విద్య, వైద్య ఖర్చుల భారం అధికంగా ఉంటోందని, ఆ భారాన్ని తగ్గించడంతో పాటు వ్యాధులను ముందస్తుగా గుర్తించి నివారణ చర్యలు చేపట్టేందుకు ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్, కాస్ట్-ఎఫెక్టివ్ పద్ధతిలో వైద్య సేవలు అందించాలని సూచించారు. స్క్రీనింగ్ నుంచి చికిత్స, ఫాలో-అప్ వరకు ఏఐ డాక్టర్ సేవలను అందుబాటులోకి తేవాలని, ప్రజల ఆరోగ్య సమాచార భద్రతకు పెద్దపీట వేస్తూ డిజిటల్ హెల్త్ కార్డులను జారీ చేయాలని ఆదేశించారు.ఆశాజనకంగా పైలట్ ఫలితాలుపైలట్ ప్రాజెక్టు కింద చిత్తూరులో హైపర్‌టెన్షన్ (బీపీ) కేసులు 56% నియంత్రణలోకి రాగా, మధుమేహం తీవ్రత 16% తగ్గినట్లు అధికారులు సీఎంకు వివరించారు. సర్వేలో 91% మంది ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెరిగిందని సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు.ఈ ప్రాజెక్టులో అధికారిక భాగస్వామిగా ఉన్న 'టాటా ఎండీ' (ఏజీబీజీ ఓఆ) సరికొత్త సాంకేతిక ఆవిష్కరణలతో ముందుకు రావాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. 28 జిల్లాల్లోని వైద్య సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, కార్యదర్శి వీరపాండియన్, ఉన్నతాధికారులు మరియు టాటా ఎండీ ప్రతినిధులు పాల్గొన్నారు.

# NH - 65 హైదరాబాద్ - విజయవాడ రహదారి 17 బ్లాక్ స్పాట్స్ పై ఫ్లై ఓవర్లు అతి త్వరలో పూర్తి చేయాలి

**చిట్యాల ఫ్లై ఓవర్ ఈ దసరా నాటికి పూర్తి చేయాలి**

**మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలి..సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలి**

**నిత్యం జరుగుతున్న ప్రమాదాలు నివారించాలంటే రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి**

**6o2 రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశాం**

**తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే మా ధ్యేయం..మాకు ఎలాంటి బేషజాలు లేవు**

**రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరొక్కసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలుస్తాం..అవసరమైతే ప్రధాన మంత్రిని కలుస్తాం**

**NH 65 విస్తరణ పనులతో పాటు ఇతర NHAI ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతా**

**- సమీక్షలో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ???**

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై,కొన్ని చోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి



హైదరాబాద్:హైదరాబాద్ - విజయవాడ రహదారి పై నిత్యం జరుగుతున్న ప్రమాదాలతో ఇప్పటికే వేల మంది తమ ప్రాణాలను కోల్పోయారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.

డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో గురువారం రోడ్లు భవనాల శాఖ పరిధిలోని పలు రోడ్లు, చీఏ ప్రాజెక్ట్స్ పురోగతిపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కోదాడ వద్ద జరిగిన బస్సు ప్రమాదంతో పాటు ఇటీవల జరిగిన పలు ప్రమాదాలపై మంత్రి అధికారులను ఆరా తీశారు.

హైదరాబాద్ - విజయవాడ రహదారిలో గుర్తించిన 17 బ్లాక్ స్పాట్స్ పై నిర్మిస్తున్న ఫ్లై ఓవర్లు,హై మాస్క్ లైట్స్ పనుల పురోగతిని మంత్రి అడిగి తెలుసుకున్నారు.

దాదాపు అన్ని ఫ్లై ఓవర్లు నిర్మాణ చివరి దశలో ఉన్నాయని అధికారులు మంత్రికి వివరించారు.

పెద్దకాపర్తి ఫ్లై ఓవర్ ఇప్పటికే ట్రాఫిక్ అనుమతిస్తుండగా,సూర్యాపేట ఈనాడు ఆఫీస్ వద్ద ఫ్లై ఓవర్ ట్రాఫిక్ అనుమతికి సిద్ధంగా ఉందన్నారు.

చిట్యాల ఫ్లై ఓవర్ ఈ దసరా నాటికి పూర్తి చేయాలనీ,మిగతావి డిసెంబర్ చివరి నాటికి అందుబాటులోకి తేవాలని మంత్రి ఆదేశించారు. ఆ ఫ్లై ఓవర్ల నుండి ఈ సంక్రాంతికి వాహనాల రాకపోకలు సాగాలని అధికారులకు తేల్చి చెప్పారు.

ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై,కొన్ని చోట్ల రహదారికి రెయిలింగ్ లేని వార్తలపై ఆరా తీసిన మంత్రి..NHAI అధికారులకు పలు సూచనలు చేశారు. మూగ జీవులు రహదారిపైకి రాకుండా రెయిలింగ్ తో పాటు,రోడ్ సేఫ్టీ జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.


నిత్యం జరుగుతున్న ప్రమాదాలు నివారించాలంటే ఈ రహదారి విస్తరణ పనులు త్వరగా చేపట్టాలన్నారు. 6o2 రహదారి విస్తరణ కోసం ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారితో కలిసి కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిశామని గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్ర అభివృద్దే తమ ధ్యేయమని,అందుకోసం తమకు ఎలాంటి బేషజాలు లేవు అని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఇప్పటికే స్పష్టం చేశారన్నారు.

రాష్ట్రం నుండి ప్రాతినిథ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులతో కలిసి మరొక్కసారి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ గారిని కలుస్తాం..అవసరమైతే ప్రధాన మంత్రిని కలుస్తామన్నారు.

NH 65 విస్తరణ పనులతో పాటు,బుల్లెట్ ట్రైన్స్,ఇతర NHAI ప్రాజెక్ట్స్ త్వరగా చేపట్టాలని కోరతామని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు.

సమీక్షలో ఆర్ అండ్ బి ఈఎన్సి లింగారెడ్డి,సి.ఈ లు వసంత్ నాయక్,ధర్మారెడ్డి, పలువురు చీఏ అధికారులు ఉన్నారు.



# తెలంగాణలో భారీగా ఆధునిక ధాన్య సైలోలు

## --- నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

**మొదటి పేజీ తరువాయి** పౌర సరఫరాల సంస్థ కార్యకలాపాలపై సీనియర్ అధికారులతో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తి, సేకరణకు అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని విస్తరించాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు.

మెరుగైన సాగునీటి సదుపాయాలు, సాగు విస్తీర్ణం పెరగడం, కనీస మద్దతు ధరకు ప్రభుత్వం ధాన్యం సేకరిస్తుండడంతో తెలంగాణలో వరి ఉత్పత్తితో పాటు ధాన్యం కొనుగోళ్లు కూడా ఏటేటా పెరుగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సేకరించిన ధాన్యాన్ని సురక్షితంగా, శాస్త్రీయంగా నిల్వ చేసేందుకు వ్యూహాత్మక ప్రాంతాల్లో ఆధునిక నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేయడం అత్యవసరమైందన్నారు.

సంప్రదాయ గోదాములతోనే సరిపోదు

భవిష్యత్ అవసరాలను కేవలం సంప్రదాయ గోదాములతో తీర్చడం సాధ్యం కాదని మంత్రి స్పష్టం చేశారు. తెలంగాణకు ఆటోమేటెడ్ హ్యాండ్లింగ్, శాస్త్రీయ సంరక్షణ, యాంత్రిక రవాణా, డిజిటల్ పర్యవేక్షణ వంటి అత్యాధునిక సాంకేతిక వ్యవస్థలతో కూడిన నిల్వ నెట్‌వర్క్ అవసరమన్నారు.

తేమ, పురుగులు, ఇతర నిల్వ సంబంధిత కారణాలతో ధాన్యం నష్టపోకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని సూచించారు. ధాన్యం నిల్వ నుంచి తరలింపు వరకు ప్రతి దశలో నాణ్యత, భద్రత, సామర్థ్యాన్ని పెంచే విధంగా సైలో వ్యవస్థ ఉండాలని పేర్కొన్నారు.

మహిళా స్వయం సహాయక సంఘాలు, గ్రామస్థాయి సంస్థలు, పౌర సరఫరాల సంస్థ భాగస్వామ్యంతో ఆధునిక సైలోల నిర్మాణం, నిర్వహణ చేపట్టేందుకు అనువైన నమూనాలను అధ్యయనం చేయాలని మంత్రి ఆదేశించారు. ఇందులో పౌర సరఫరాల సంస్థ, మహిళా సంఘాలు, ఇతర భాగస్వామ్య సంస్థల బాధ్యతలను స్పష్టంగా నిర్వచించాలని చెప్పారు. సైలోలు ఆర్థికంగా స్వయం సమర్థంగా, వృత్తిపరంగా నిర్వహించబడేలా తగిన ఆర్థిక, కార్యాచరణ నమూనాలను రూపొందించాలన్నారు.

"రాష్ట్ర ధాన్య నిల్వ మౌలిక సదుపాయాలను కేవలం వచ్చే కొనుగోలు సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని కాదు... రాబోయే దశాబ్దాల అవసరాలను ముందుగానే అంచనా వేసి నిర్మించాల్సిన ఆవశ్యకత ను ఆయన వివరించారు.

ప్రస్తుతం తెలంగాణలో పౌర సరఫరాల సంస్థ, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ, కేంద్ర గిడ్డంగుల సంస్థ, భారత ఆహార సంస్థ, వ్యవసాయ మార్కెట్ కమిటీలు, ప్రైవేటు పెట్టుబడిదారుల గోదాముల ద్వారా ధాన్యం నిల్వ సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థకు సొంతంగా సుమారు 6 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యం ఉన్నప్పటికీ, ప్రతి సీజన్‌లో భారీగా సేకరిస్తున్న ధాన్యాన్ని నిల్వ చేసేందుకు ఇతర సంస్థలు, అద్దె గోదాములపై ఆధారపడాల్సి వస్తోందన్నారు.

90 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణకు సిద్ధమైన వ్యవస్థ

ఇటీవలి ధాన్యం సేకరణ పరిమాణమే రాష్ట్ర నిల్వ వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడిని తెలియజేస్తోందని మంత్రి చెప్పారు. ఈ ఏడాది రబీ సీజన్‌లో పౌర సరఫరాల సంస్థ 90 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ధాన్యం సేకరించేందుకు సిద్ధమైందని, సీజన్ కార్యాచరణ ప్రణాళికలో భాగంగా తక్షణమే సుమారు 12 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వకు ఏర్పాట్లు చేసినట్లు వివరించారు.

భారీ స్థాయిలో పెరుగుతున్న ధాన్యం సేకరణకు, అందుబాటులో ఉన్న శాశ్వత శాస్త్రీయ నిల్వ సామర్థ్యానికి మధ్య పెరుగుతున్న అంతరం కొత్త సైలోల నిర్మాణం ఎంత అత్యవసరమో స్పష్టం చేస్తోందన్నారు.

బియ్యం మిల్లర్ల బకాయిల వసూలుకు పటిష్ట వ్యూహండిఫాల్టర్ కస్టమ్ రైస్ మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిల వసూలును వేగవంతం చేసేందుకు సమర్థవంతమైన కార్యాచరణ రూపొందించాలని మంత్రి పౌర సరఫరాల సంస్థను ఆదేశించారు.

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆదేశాలు, ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు అనుగుణంగా బకాయిల వసూలు వ్యూహాన్ని సిద్ధం చేయాలని చెప్పారు.

డిఫాల్టర్లపై చేపట్టే న్యాయపరమైన, విజిలెన్స్, పరిపాలనాపరమైన చర్యలన్నింటిలోనూ ప్రజాధనం తిరిగి రాబట్టడమే ప్రధాన లక్ష్యంగా ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

ధాన్యం వేలంలో పూర్తి పారదర్శకత

ధాన్యం నిల్వల ప్రతిపాదిత వేలంపైనా మంత్రి సమీక్షించారు. తదుపరి విడత వేలం ప్రారంభించే ముందే లాట్ పరిమాణాలు, బిడ్డింగ్ నిబంధనలు, వేలం నిర్వహించే వేదికలను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు.

వేలం ప్రక్రియలో పారదర్శకత, ఏకరూపత, విస్తృత భాగస్వామ్యం ఉండేలా గవర్నమెంట్ ఈ-మార్కెట్‌ప్లేస్ (GeM), తెలంగాణ ఈ-ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్ వంటి గుర్తింపు పొందిన ప్రభుత్వ వేదికలను వినియోగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

రాష్ట్రంలో పెరుగుతున్న ధాన్యం ఉత్పత్తికి తగిన నిల్వ సామర్థ్యాన్ని సృష్టించడం ద్వారా రైతుల కష్టార్జిత పంటకు భద్రత కల్పించడంతో పాటు, ప్రజాధనాన్ని కాపాడటం, నిల్వ నష్టాలను తగ్గించడం, పౌర సరఫరాల వ్యవస్థను మరింత ఆధునికంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో పౌర సరఫరాల అదనపు సంచాలకులు రోహిత్ సింగ్, పౌర సరఫరాల సంస్థకు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# బొగ్గు మైనింగ్ లో కలిసి నడుద్దాం



తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బెంగళూరు పర్యటనలో భాగంగా కర్ణాటక ఇంధన శాఖ మంత్రి కె.జె. జార్జ్‌తో గురువారం సమావేశం అయ్యారు . రెండు రాష్ట్రాల మధ్య ఇంధన రంగ పురోగతి, బొగ్గు సరఫరా, బొగ్గు కొనుగోళ్ళ చెల్లింపులు, సాంకేతికత మార్పిడిపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు.

ఈ సమావేశంలో కర్ణాటక అడిషనల్ చీఫ్ సెక్రెటరీ గౌరవ్ గుప్తా, సింగరేణి సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, కెపిసిఎల్ ఎం.డి రాజేంద్ర చోళన్, కెపిసిఎల్ ఫైనాన్స్ డైరెక్టర్ నాగరాజు, సింగరేణి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కోల్ మూవ్ మెంట్) బి. వెంకన్న, జిఎం శ్రీనివాస్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎరుగుతున్న విద్యుత్తు డిమాండు కు అనుగుణంగా తగినంత బొగ్గును అందించడం కోసం సింగరేణి సంస్థ మరియు కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థలు ఒక జాయింట్ వెంచర్ (సంయుక్త భాగస్వామ్యం) గా కలిసి పని చేద్దామని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కర్ణాటక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ కె. జె. జార్జ్ కు ప్రతిపాదన చేశారు.

పెరుగుతున్న కర్ణాటక విద్యుత్ అవసరాల నేపథ్యంలో కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ ఛత్తీస్ గఢ్, ఒడిషా రాష్ట్రాల్లో చేపట్టిన క్యాప్టివ్ కోల్ బ్లాక్ లలో బొగ్గు తవ్వకం లో అనుభవం కలిగిన సింగరేణి సంస్థతో ఆ బ్లాకుల్లో మైనింగ్ జరపడానికి ఒక జాయింట్ వెంచర్ కంపెనీగా ఏర్పడి కలిసి ముందుకుపోతే బాగుంటుందని డిప్యూటీ సీఎం ప్రతిపాదించారు. సింగరేణి సంస్థకు బొగ్గు మైనింగ్ లో దాదాపు 137 సంవత్సరాల అనుభవం ఉందని కనుక కర్ణాటక పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ చేపట్టిన బొగ్గు బ్లాక్ లలో మైనింగ్ జరపగలదని, అలాగే కర్ణాటక రాష్ట్రానికి విద్యుత్ రంగంలో ఉన్న అపార అనుభవాన్ని సింగరేణి సంస్థ కూడా తాను చేపట్టబోయే పవర్ ప్లాంట్ ల నిర్వహణలో వినియోగించుకోవచ్చని, ఈ విధంగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వ సంస్థల పరస్పర సహకారంతో అభివృద్ధి విస్తరణ లక్ష్యంగా ఒక జాయింట్ వెంచర్ సంస్థగా సింగరేణి కె.పి.సి.ఎల్ కలిపి ఏర్పడే అవకాశం పై అధ్యయనం చేయాలని సూచించారు. దీనిపై కర్ణాటక రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ కె. జె. జార్జ్ సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ కర్ణాటక రాష్ట్రానికి సరఫరా చేస్తున్న బొగ్గు పై కూడా చర్చించారు.

కర్ణాటకలో పారిశ్రామిక ప్రగతి కారణంగా విద్యుత్‌కు విపరీతమైన డిమాండ్ పెరుగుతోందని, థర్మల్ పవర్ ప్రాజెక్టుల నిర్వహణకు తెలంగాణ నుంచి బొగ్గును నిరంతరం సరఫరా చేయాలని కర్ణాటక మంత్రి కె.జె. జార్జ్ కోరారు. ఇందుకు తెలంగాణ డిప్యూటీ సీఎం సానుకూలంగా స్పందించారు. కేంద్ర బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ కేటాయింపుల మేరకు బొగ్గు సరఫరా జరిగేలా చూస్తామన్నారు.

కర్ణాటక రాష్ట్రానికి సింగరేణి సంస్థ ఏడాదికి బొగ్గు లింకేజీ ద్వారా 10.54 మిలియన్ టన్నుల బొగ్గును సరఫరా చేస్తోందన్నారు. సింగరేణి సంస్థ ప్రస్తుతం కర్ణాటకలోని ఎర్రమారుస్ థర్మల్ పవర్ ప్లాంట్ కు 5.24 మిలియన్ టన్నుల బొగ్గును పూర్తి లింకేజీ ద్వారా సరఫరా చేస్తుందని, పాక్షిక లింకేజీ తో రాయచూరు లోని థర్మల్ పవర్ ప్లాంట్ కు 3.01 మిలియన్ టన్నుల బొగ్గు, బళ్ళారి యూనిట్-3 థర్మల్ ప్లాంట్ కు 2.29 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేస్తున్నామని వివరించారు. రోజుకు కనీసం 4 రేకుల ద్వారా బొగ్గు సరఫరా జరుగుతోందన్నారు.

# శ్రీశైలం దేవస్థానంలో భారీ ప్రక్షాళన..

కర్నూలు, ఆగస్టు 27, శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ ప్రక్షాళన ప్రారంభమైంది. పరిపాలనలో సమర్థత, పారదర్శకత కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను అంతర్గతంగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పులు దేవస్థానం దైనందిన కార్యకలాపాల్లో మెరుగైన సమన్వయాన్ని తీసుకువస్తాయని అంచనా. నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు.నంద్యాల జిల్లా శ్రీశైలం దేవస్థానంలో వరుస వివాదాల నేపథ్యంలో భారీ స్థాయిలో అంతర్గత బదిలీల ప్రక్రియ ప్రారంభమైంది. పరిపాలనలో మార్పులు, విధుల నిర్వహణలో సమన్వయం కోసం దేవస్థానం ఈఓ శ్రీనివాసరావు 37 మంది ఉద్యోగులను స్థానికంగా అంతర్గత బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పర్యవేక్షణ స్థాయి అధికారి నుంచి అటెండర్, హెల్పర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి వరకు వివిధ కేటగిరీలకు చెందిన సిబ్బంది ఈ బదిలీల్లో ఉన్నారు.దేవస్థానం పరిపాలన సౌలభ్యం, విధుల సమర్థవంతమైన నిర్వహణను దృష్టిలో ఉంచుకుని ఈ అంతర్గత బదిలీలు చేపట్టినట్లు ఈఓ శ్రీనివాసరావు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను ఇతర విభాగాలు, స్థానాల్లోకి మార్చడంతో పరిపాలనా వ్యవస్థలో కొత్త సమీకరణాలు చోటుచేసుకోనున్నాయి.బదిలీ ఉత్తర్వులు అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులు ప్రస్తుతం నిర్వహిస్తున్న విధుల నుంచి రిలీవ్ అయి, ఉత్తర్వుల్లో కేటాయించిన నూతన స్థానాల్లో వెంటనే విధుల్లో చేరాలని ఈఓ స్పష్టం చేశారు. ఉద్యోగుల విధుల మార్పు ప్రక్రియలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికార యంత్రాంగం ఆదేశించింది.ఇటీవల శ్రీశైలం దేవస్థానంలో పలు అంశాలు వివాదాలకు దారితీసిన నేపథ్యంలో తాజా బదిలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు ప్రత్యేక శ్రద్ధతో ఈ బదిలీల ప్రక్రియను నిర్వహించినట్లు ఉద్యోగుల వర్గాల్లో సమాచారం వినిపిస్తోంది. మొత్తంగా 37 మంది ఉద్యోగుల స్థానిక అంతర్గత బదిలీలతో శ్రీశైలం దేవస్థానంలో పరిపాలనా వ్యవస్థలో మార్పులు ప్రారంభమైనట్లు తెలుస్తోంది. ఈ మార్పుల అనంతరం దేవస్థానం రోజువారీ పరిపాలన, ఉద్యోగుల విధుల నిర్వహణలో మరింత సమన్వయం ఏర్పడుతుందా అన్నది వేచి చూడాల్సి ఉంది..!

# కొత్త దనం లేని జగన్ ప్రెస్ మీట్

విజయవాడ, ఆగస్టు 27, వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. వైయస్సార్ కాంగ్రెస్ అధినేత జగన్మోహన్ రెడ్డి వారానికి ఒక్కసారి ప్రెస్ మీట్ పెడుతున్నారు. అయితే స్వల్ప వ్యవధిలో ఇలా ప్రెస్ మీట్ పెడుతుండడంతో పెద్దగా ఆసక్తికరమైన అంశాలు ఆయన మాట్లాడలేకపోతున్నారు. కనీసం నెలకోసారి ఇలా ప్రెస్ మీట్ పెడితే కొంత కొత్తదనం ఉండేది. పార్టీ నేతలతో ముందురోజు మాట్లాడుతున్నారు. ఆ వీడియోలు బయటకు వస్తున్నాయి. ఆ తరువాత రోజు ప్రెస్ మీట్ పెట్టుకుని కొన్ని రకాల స్క్రిప్టులను చూసి మాట్లాడుతున్నారు. అందులో కొత్తదనం ఏమీ కనిపించడం లేదు. అటు తిరిగి ఇటు తిరిగి చంద్రబాబు ప్రభుత్వాన్ని తప్పు పట్టడం.. అవి తమ హయాంలోనే బాగా అమలు చేశామని చెప్పడం వంటివి మాత్రమే జరుగుతున్నాయి. ఈ వారాంతపు ప్రెస్ మీట్ లో కూడా అదే పరిస్థితి కనిపించింది.బీసీ రిజర్వేషన్ల అంశంపై జగన్మోహన్ రెడ్డి మరోసారి రాజకీయ విమర్శలు చేశారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో రెండు డిప్యూటీ సీఎం పదవులతో పాటు కేబినెట్ లోని 25 మందిలో 11 మంది బీసీలకు ఇచ్చామని గుర్తు చేశారు. 40 శాతం మంత్రి పదవులకు వారికి కేటాయించామని ప్రస్తావించారు. అప్పట్లోనే స్థానిక సంస్థల ఎన్నికల్లో 34 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు సిద్ధపడితే కోర్టుల ద్వారా చంద్రబాబు అడ్డుకున్నారంటూ చెప్పుకొచ్చారు. రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదన్న కోర్టు తీర్పులను ప్రస్తావిస్తూ.. కూటమి ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల పేరుతో గ్రామాలకు దిగుతోందని ఆరోపించారు. అయితే ఇప్పుడు న్యాయపరమైన అడ్డంకులను అధిగమించి బీసీ రిజర్వేషన్లు 34% కల్పించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. దానిని స్వాగతించాల్సింది పోయి గతంలో తాను గొప్పగా చేశానని చెప్పుకునే ప్రయత్నం చేశారు. బీసీల రిజర్వేషన్ల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ హయాంలో ఎలా నడుచుకుంది బలహీన వర్గాలకు తెలుసు.జగన్మోహన్ రెడ్డి మీడియా సమావేశాలు అంటేనే ముఖ్యంగా మీడియా ప్రతినిధులకు ఆసక్తి తగ్గిపోయింది. మెయిన్ మీడియా కంటే సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లకు, రీల్స్ లో, ఇన్స్టాగ్రామ్ లో ఉన్నవారికి ఆసక్తి. ఇప్పుడు జగన్ చేసే వ్యాఖ్యలకు.. ఆయన హయాంలో జరిగిన పరిణామాలను జత పోలుస్తూ మీమ్స్ ఓ రేంజ్ లో వేసుకుంటారు. సోషల్ మీడియా తెరిస్తే అదే పనిగా జగన్ పైనే రీల్స్ కనబడుతూ ఉంటాయి. అందుకే వారాంతపు మీడియా సమావేశాలు మాత్రం బోర్ కొడుతున్నాయి.

రాతపూర్వక స్క్రిప్టులు చదవడం తప్ప ప్రజలకు కొత్తగా చెప్పేదేమీ లేకుండా పోతోంది. అది కూడా సొంత అనుబంధ మీడియా ఛానల్ లైవ్ కవరేజ్ ఇచ్చినా ప్రయోజనం లేకుండా పోతోంది. జగన్ మీడియా సమావేశాన్ని జనాలు లైట్ తీసుకుంటున్నారు. ఆయన చెప్పిన దాంట్లో విశ్వసనీయత కంటే మరో కోణంలో వెతుకులాట ఎక్కువగా కనిపిస్తోంది. ఇక తెలుసుకోవాల్సింది ఆయన మాత్రమే.

# మంత్రికి పవర్ కట్...

హైదరాబాద్, ఆగస్టు 27, తెలంగాణ కాంగ్రెస్ రాజకీయాల్లో మంత్రి కొండా సురేఖ వ్యవహారం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగింది. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానంతో కొండా ఫ్యామిలీ వైరం తారస్థాయికి చేరిన వేళ.. ఆమెను నేరుగా పదవి నుంచి తప్పించకుండానే, మంత్రిత్వ శాఖలో ఉన్న అధికారాలన్నింటికీ కత్తెర వేసే సరికొత్త ఆపరేషన్ మొదలైంది. ప్రత్యక్షంగా వేటు వేస్తే వచ్చే రాజకీయ నష్టాన్ని నివారిస్తూ, పరిపాలనాపరంగా ఉక్కిరిబిక్కిరి చేసి ఆమే స్వయంగా తప్పుకునేలా లేదా దిగివచ్చేలా చేయడమే ఈ వ్యూహం వెనుక ఉన్న అసలు లక్ష్యంగా కనిపిస్తోంది.పర్యావరణ, అటవీ శాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖకు తాజాగా ప్రభుత్వం ఊహించని షాక్ ఇచ్చింది. మంత్రికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండానే, ఆమె తనకు అనుకూలంగా నియమించుకున్న దాదాపు 20 మందికి పైగా అధికారుల డిప్యూటేషన్లను ప్రభుత్వం రద్దు చేసింది. ఇందులో కీలకమైన ఐఎఫ్ఎస్ అధికారులతో పాటు ఇతర ఉన్నతాధికారులు కూడా ఉన్నారు. వీరిని తక్షణమే మాతృశాఖలకు పంపించడంతో పాటు, సచివాలయం, క్షేత్రస్థాయి యంత్రాంగానికి బలమైన సంకేతాలు వెళ్లాయి. ఉన్నతాధికారులు ఇకపై మంత్రి నిర్ణయాల కంటే సీఎంఓ ఆదేశాలకే ప్రాధాన్యత ఇవ్వాలనే పరిస్థితిని తీసుకురావడం ద్వారా శాఖాపరంగా ఆమెను పూర్తిగా డమ్మీ చేసేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కొండా సురేఖ కుటుంబం బహిరంగంగా విమర్శలు గుప్పించిన తర్వాత, ఆమెపై వెంటనే క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారని అంతా భావించారు. అయితే, ఆమెను నేరుగా మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేస్తే ఒక బలమైన బీసీ మహిళా నేతపై కాంగ్రెస్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందనే సామాజిక ముద్ర పడే ప్రమాదం ఉంది. ఈ 'బీసీ సెంటిమెంట్' రాజకీయంగా బూమ రాంగ్ కాకుండా ఉండటానికే అధిష్టానం తాత్కాలికంగా ఈ పరోక్ష వ్యూహాన్ని ఎంచుకున్నట్టు సమాచారం.నేరుగా వేటు వేయకుండా అధికారాలను నియంత్రించడం ద్వారా.. మంత్రిగా ఎలాంటి కీలక నిర్ణయాలు తీసుకోలేరు. పరిపాలనాపరంగా, రాజకీయంగా పార్టీలో ఆమె ఒంటరి అవుతుంది. స్వయంగా రాజీనామా చేసేలా మానసిక ఒత్తిడి పెంచడం లేదా అధిష్టానం వద్దకు వచ్చి రాజీపడేలా చేయడం దీని వెనుక వ్యూహంగా ఉంది.మరోవైపు, కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్ సెటిల్‌మెంట్ల వ్యవహారం చుట్టూ చట్టపరమైన ఉచ్చు బిగుస్తోంది. పాత ఆరోపణలు, సెటిల్‌మెంట్లపై పోలీసులు విచారణను ఒక్కసారిగా వేగవంతం చేశారు. గత కేసులను బయటకు తీసి దర్యాప్తు చేయడం వెనుక పక్కా వ్యూహం కనిపిస్తోంది. దీనివల్ల కొండా కుటుంబం కేవలం రాజకీయంగానే కాకుండా, చట్టపరమైన అంశాల్లోనూ పూర్తిగా డిఫెన్స్‌లో పడిపోతుంది. అవినీతి, అక్రమాల ఆరోపణల చుట్టూ చర్చను తిప్పడం ద్వారా కొండా సురేఖ సామాజిక కోణాన్ని లేదా 'బీసీ కార్డు'ను రాజకీయ రక్షణ కవచంగా వాడుకునే అవకాశాన్ని ప్రభుత్వం సమర్థవంతంగా మూసివేసింది.ఏ రాజకీయ నాయకుడికైనా అధికారాలు లేని మంత్రి పదవిలో కొనసాగడం చిరాకు తెప్పిస్తుంది. చేతులు కాలకుండా ఆకులు పట్టుకునే చందంగా కాంగ్రెస్ నాయకత్వం వేసిన ఈ ఎత్తుగడ కొండా సురేఖను పూర్తి ఆత్మరక్షణలోకి నెట్టింది.

# మీనాక్షి నటరాజన్ చేతులెత్తేసేరా



హైదరాబాద్, ఆగస్టు 27, తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్‌గా మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్‌ను ఏఐసీసీ నియమించినప్పుడు.. అధికారంలో ఉన్న పార్టీలో చెలరేగుతున్న ఆధిపత్య పోరును, అసమ్మతులను ఆమె అరికడతారని అధిష్టానం, పార్టీ కేడర్ భావించాయి. రాహుల్ గాంధీ బృందంలో అత్యంత కీలక సభ్యురాలిగా, సాదాసీదా జీవితం గడిపే అవినీతి రహిత నాయకురాలిగా ఆమెకున్న గుర్తింపు తెలంగాణలోని ముఠా రాజకీయాలను గాడిలో పెడుతుందని భావించారు. అయితే, ఆచరణలో తెలంగాణ కాంగ్రెస్ నేతల స్వయంప్రతిపత్తి, వర్గ రాజకీయాల ముందు ఏఐసీసీ ప్లానింగ్ పూర్తిగా తేలిపోయిందనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. గాంధీ భవన్ వేదికగా జరుగుతున్న ఆధిపత్య పోరును, ముఖ్యమంత్రి వర్గానికి, మిగిలిన సీనియర్ నేతలకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రాథమిక దశలోనే పరిష్కరించడంలో మీనాక్షి నటరాజన్ వైఖరి అత్యంత మెతకగా ఉందనే అభిప్రాయం బలపడింది. విమర్శలు, వివాదాలు రచ్చకెక్కిన ప్రతిసారీ సమీక్షలు , అంతర్గత చర్చలు లేదా కమిటీల పేరుతో సమయాన్ని గడపడమే తప్ప .. పార్టీ క్రమశిక్షణను దాటిన బడా నేతలపై కఠిన చర్యలు తీసుకునే సాహసం ఆమె చేయలేకపోయారు. దీనివల్ల అసమ్మతి నేతలకు ఏఐసీసీ పట్ల భయం లేకుండా పోయిందనే టాక్ వినిపిస్తోంది. అసమ్మతి స్వరాలు పెరిగినప్పుడు రాజీ మార్గాలు వెతకడం వేరు, కఠిన నిర్ణయాలతో పార్టీ లైన్ దాటకుండా చేయడం వేరు. తెలంగాణ కాంగ్రెస్ సంస్కృతికి తగ్గట్లుగా కఠిన నిర్ణయాలు తీసుకోకపోవడమే ఆమె వైఫల్యంగా కనిపిస్తోంది.తెలంగాణ కాంగ్రెస్‌లో సీఎం రేవంత్ రెడ్డికి ఉన్న పట్టు, అదే సమయంలో కేబినెట్ మంత్రులు , పాత తరం కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న తీవ్ర వ్యతిరేకతను సమన్వయం చేయడంలో ఇన్‌ఛార్జ్ వ్యవస్థ విఫలమైంది. ఒకవైపు మంత్రుల మధ్య అంతర్గత పోరు, కొండా సురేఖ ఎపిసోడ్ వంటి ఘటనలు మీడియా ముందుకు వచ్చి పార్టీ ప్రతిష్టను దిగజార్చుతున్నా.. కేవలం అధిష్టానానికి నివేదికలు పంపడానికే ఇన్‌ఛార్జ్ పరిమితమయ్యారనే కామెంట్లు వస్తున్నాయి. ఈ అంతర్గత బలహీనతల నడుమ, మధ్యప్రదేశ్‌లో ఖాళీ అయిన రాజ్యసభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ నామినేషన్ దాఖలు చేయగా తెలంగాణలోని ఓ ప్రైవేట్ కేసు వివరాల వల్ల రిటర్నింగ్ ఆఫీసర్ నామినేషన్‌ను తిరస్కరించింది. ఆమె రాజకీయ జీవితంలో అతిపెద్ద ఎదురుదెబ్బగా మారింది. తెలంగాణ వంటి సంక్లిష్టమైన రాష్ట్రంలో గ్రూపు రాజకీయాలను నడిపించడంలో ఆమె అనుభవం సరిపోలేదనే సంకేతాలు పంపాయి. రాజ్యసభ అవకాశాన్ని కోల్పోవడం వల్ల ఢిల్లీ స్థాయిలోనూ, తెలంగాణ నేతల వద్ద కూడా ఆమె రాజకీయ పరపతి మరింత తగ్గిపోయిందనే విశ్లేషణలు సాగుతున్నాయి. కేవలం మంచి ఇమేజ్ , రాహుల్ గాంధీ ఆశీస్సులు మాత్రమే ప్రాంతీయంగా బలంగా ఉన్న వర్గ రాజకీయాలను నియంత్రించలేవు. తెలంగాణ కాంగ్రెస్ మరింత వివాదాల్లోకి వెళ్లకుండా ఉండాలంటే.. మీనాక్షి నటరాజన్ తన మెతక వైఖరి ని వీడి, శస్త్రచికిత్స తరహా కఠిన నిర్ణయాలు తీసుకోవడం లేదా అధిష్టానం ఒక పవర్‌ఫుల్ ప్రత్యామ్నాయ వ్యూహకర్తను రంగంలోకి దించడం తప్ప వేరే మార్గం కనిపించదని అంటున్నారు.

# బ్రాహ్మణులను అవమానించొద్దు ,చెప్పుడు మాటలు చేటు తెస్తాయి

## అది గమనించి మెదలు కోవాలి కవిత వ్యాఖ్యలను ఖండించిన బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బి శ్రీనివాస్




హైదరాబాద్ ఆగస్ట్ 27 : చెప్పుడు మాటలు చేటు తెస్తాయని అది గమనించి మెదలు కోవాలని రక్షణ సేన అధ్యక్షురాలు కవితకు తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్ సూచించారు. గురువారం ఆయన గాంధీ భవన్లో వైస్ చైర్మన్ సుబ్రహ్మణ్య ప్రసాద్ తో కలిసి ఆయన మీడియా తో మాట్లాడారు.బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ పదవి విషయంలో తెలంగాణ రక్షణ సేన అధినేత్రి కవిత చేసిన వ్యాఖ్యలు సరికావని ఆయన పేర్కొన్నారు వ్యక్తుల ప్రాంతీయతను ముందుకు తెచ్చి ఒక సామాజిక వర్గాన్ని విభజించే ప్రయత్నం చేయడం తగదన్నారు.

తనను చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం వెనుక ఎలాంటి ప్రాంతీయ అంశం లేదని, బ్రాహ్మణ సమాజ సంక్షేమం కోసం పనిచేయాలన్న ఉద్దేశంతోనే బాధ్యతలు అప్పగించారని తెలిపారు. తాను చెప్పుడు మాటల ద్వారా కవిత ఆరోపించి నట్టుగా ఆంధ్ర ప్రాంత వ్యక్తిని కాదని పూర్వికులు ఖమ్మం ప్రాంతావాసులని తాను నల్గొండ జిల్లా నడిగూడెంలో జన్మించానని విద్యాభ్యాసం మొత్తం తెలంగాణ లోనే సాగిందని ఆయన వివరించారు.పదవులు ప్రాంతంతో పాటు వారి సామర్థ్యం, సేవా భావం, సమాజానికి చేసిన కృషిని పరిగణనలోకి తీసుకుని ఇస్తారని ఆ విషయం ఎంపీ, ఎమ్మెల్సీ గా చేసిన కెసిఆర్ బిడ్డ కవితకు తెలవక పోవడం విచారకరమన్నారు.

తెలంగాణ ఉద్యమంలో బ్రాహ్మణ సమాజం కూడా తన వంతు పాత్ర పోషించిందని శ్రీనివాస్ పేర్కొన్నారు. తెలంగాణలోని బ్రాహ్మణుల సంక్షేమం, పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం, విద్యార్థులకు విద్యా అవకాశాలు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

బ్రాహ్మణ సమాజాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని అన్నీ పార్టీల చెందిన బ్రాహ్మణ బంధువులు తన పదవి ప్రమాణ కార్యక్రమం లో పాల్గొన్నారని ఆ విషయం రక్షణ సేన లోని బ్రాహ్మణ వ్యక్తులను అడగాలని ఆయన కవిత కు సూచించారు. పార్టీలు వ్యక్తులను పరిషత్ పట్టించుకోదని అది అందరికి ఉపయోగ పడుతుందని తెలిపారు ప్రాంతం గురించి ప్రశ్నించడం కంటే, బ్రాహ్మణుల కోసం నేను ఏం చేస్తానన్నదే ముఖ్యం. కవిత చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగతంగా నన్ను బాధించడమే కాకుండా, బ్రాహ్మణ సమాజాన్ని కూడా అవమానించేలా ఉన్నాయన్నారు తెలంగాణలో ఉన్న ప్రతి బ్రాహ్మణ కుటుంబం అభివృద్ధి కోసం పనిచేస్తానని ఎవరు ఎన్ని విమర్శలు చేసినా వెనక్కి తగ్గేది లేదని శ్రీనివాస్ స్పష్టం చేశారు.ప్రాంతీయత పేరుతో సమాజంలో చిచ్చు పెట్టడం కంటే తెలంగాణ అభివృద్ధి, అన్ని వర్గాల సంక్షేమంపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. బ్రాహ్మణ పరిషత్‌ను రాజకీయ వేదికగా కాకుండా సంక్షేమ వేదికగా బలోపేతం చేయడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.ఏ పార్టీ చేయని విదంగా కాంగ్రెస్ పార్టీ ప్రజా పాలన ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నెత్రుత్వంలో బ్రాహ్మణ జాతి అభివృద్ధి కి తోడ్పాటు నిస్తున్నారని తెలిపారు. మంత్రి శ్రీధర్ బాబు తో పాటు వివిధ శాఖల్లో బ్రాహ్మణ అధికారులు కీలక శాఖల్లో ఉన్నారని బస్వరాజ్ శ్రీనివాస్ తెలిపారు

# పోలీసుల ఆధ్వర్యంలో పల్లెనిద్ర ప్రజా అవగాహన కార్యక్రమం




ఎన్టీఆర్ జిల్లా, మైలవరం మండలం, గణపవరం గ్రామంలో బుధవారం రాత్రి పోలీసులు 'పల్లెనిద్ర ? ప్రజా అవగాహన కార్యక్రమం'నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలోతెలుసుకోవడంతో పాటు, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలను భాగస్వాములను చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పోలీసులు తెలిపారు.కార్యక్రమంలో భాగంగా ముందుగా గ్రామంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పోలీసు అధికారులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం బీసీ సెంటర్‌లోని వేపచెట్టు అరుగు వద్ద పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మైలవరం సీఐ కిషోర్ గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని, సాధ్యమైనంత మేరకు క్షేత్రస్థాయిలోనే పరిష్కార మార్గాలు చూపించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఒక చక్కటి వేదికగా నిలుస్తుందని అన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల సహకారం ఎంతో కీలకమని, ప్రతి చిన్న సమస్యకు పోలీస్ స్టేషన్‌కు వెళ్లాల్సిన అవసరం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండేలా పోలీస్ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. ఎవరూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని సూచించారు.మహిళలు, బాలికలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొంటూ, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న నేరాలు, సైబర్ మోసాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో అక్రమ మద్యం, గంజాయి, పేకాట వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు.అలాగే గ్రామస్తులంతా ఐక్యంగా ఉంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని, నేరాల నియంత్రణలో పోలీసులకు సహకరించాలని సీఐ కిషోర్ గారు కోరారు. పోలీస్ శాఖను ప్రజలకు మరింత చేరువ చేయడంతో పాటు, ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని పెంపొందించేందుకు పల్లెనిద్ర కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు.ఎస్ఐ కె. సుధాకర్ గారు మాట్లాడుతూ, సైబర్ మోసాలు, 'డిజిటల్ అరెస్ట్' పేరుతో జరుగుతున్న మోసాలు, ఓటీపీ ఫ్రాడ్స్, మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలు, రోడ్డు భద్రత తదితర అంశాలపై గ్రామస్తులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఫోన్ కాల్స్, మెసేజ్‌లు లేదా లింకులకు స్పందించవద్దని సూచించారు.అనంతరం పోలీసులు, గ్రామస్తులు కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది పంచాయతీ కార్యాలయంలో బస చేశారు.

# గురునానక్ కళాశాల సమీపంలో రోడ్డు ప్రమాదం విద్యార్థి అక్కడికక్కడే మృతి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం గురునానక్ ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బుధవారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు సాయంత్రం వాకింగ్ చేస్తూ తిరిగి వస్తుండగా, మాల్ వైపు నుంచి వేగంగా వచ్చిన ట్రాలీ ఆటో ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఒక విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందరు. మరో నలుగురు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు.గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ప్రమాదానికి కారణమైన ట్రాలీ ఆటో టీఎస్ 07 యూఎన్ 0812గా గుర్తించినట్లు తెలిసింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వరదల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమంపై మంత్రి లోకేష్ సమీక్ష



అమరావతి నేపాల్లో చిక్కుకున్న ఏపీ యాత్రికుల క్షేమ సమాచారాలపై మంత్రి నారా లోకేష్ సమీక్షించారు. నేపాల్ వరదల్లో చిక్కుకున్న ఏడుగురు ఏపీ యాత్రీకులు క్షేమ సమాచారాలను అడిగి తెలుసుకున్నారు. నలుగురు సురక్షితంగా ఉన్నారని... మరో ముగ్గురు ఆచూకీ లభ్యం కాలేదని ఏపీ ఢిల్లీ భవన్ అధికారులు తెలిపారు. కుప్పం ప్రాంతానికి చెందిన బాల సుబ్రహ్మణ్యం, ఈషా ఫౌండేషన్ గ్రూప్ కు చెందిన శశికుమార్, రాజ్యలక్ష్మిలు ఆచూకీ లభించలేదని వెల్లడించారు,. మిస్సైన ముగ్గురి ఆచూకీని కనుగొనేందుకు కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరపాలని లోకేష్ సూచించారు. చైనాలోని గైరోంగ్ ఎంబసీ వద్ద ఈషా ఫౌండేషన్ సభ్యుడు శశికుమార్ చివరిసారిగా కనిపించారు. కైలాస మానససరోవర యాత్రకు వెళ్లి వరదల్లో చిక్కుకున్నా కర్నూలు జిల్లాకు చెందిన భాస్కర్ శాస్త్రి సహా మరో ముగ్గురు క్షేమంగానే వున్నారు. సురక్షితంగా ఉన్న వారిని వెంటనే తరలించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. యాత్రికుల భద్రతపై భారత రాయబార కార్యాలయం, చైనా, నేపాల్ ఎంబసీలు, గైరోంగ్ ఇమ్మిగ్రేషన్ సెంటర్, ఈషా ఫౌండేషన్ సంస్థలతో నిరంతర సంప్రదింపులు జరపాలని లోకేష్ సూచించారు. నేపాల్ లో చిక్కుకున్న యాత్రీకులు, మానస సరోవర యాత్రకు వెళ్లిన ఏపీ వాసులు సమాచారాన్ని ఆర్టీజీఎస్ అధికారులు తెలుసుకుంటున్నారు. మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు ఐటీ సెక్రటరీ కాటంనేని భాస్కర్ ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి నిరంతరం మానిటర్ చేస్తున్నారు.

# గనుల శాఖ అధికారి ఇంటిపై ఏసీబీ దాడులు



హైదరాబాద్ మైన్స్ ఏడీ జయరాజ్ ఇంటిపై ఏసీబీ దాడులు జరిపింది. భూపాలపల్లి మైన్స్ ఏడీ బొజ్జ జయరాజ్ అక్రమ ఆస్తులు కలిగి ఉన్నారనే సమాచారంతో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్, సూర్యాపేట, తాండూరు సహా 12 ప్రాంతాల్లో ఏకకాలంలో ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. జయరాజ్కు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఇతర అనుబంధ ప్రాంతాల్లో సోదాలు కొనసాగుతున్నాయి.

# రేషన్ బస్తాలపై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ను ఎత్తివేయాలి

బేతంచెర్ల ప్రభుత్వ చౌక దుకాణాలలో రేషన్ బస్తాలపై కి క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని ఎత్తివేయాలని రేషన్ డీలర్ల సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ మురళి,కోరారు. గురువారం రేషన్ డీలర్ల సమస్యలపై మండల అధ్యక్ష కార్యదర్శులు మనోహర్, అనీఫ్ బాషా,ల ఆధ్వర్యంలో బేతంచెర్ల తాహసిల్దార్ కి నాగమణికి వినతిపత్రం అందజేశారు.వారు మాట్లాడుతూ రేషన్ బస్తాల పై క్యూఆర్ కోడ్ స్కానింగ్ ను విధానం వలన డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అన్నారు.ఈ కార్యక్రమంలో డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రేసులో రాములమ్మ మంత్రి పదవిపై విజయశాంతి పేరు తెరపైకి



హైదరాబాద్ కొండా సురేఖపై చర్యల చర్చ ఖాళీ అయ్యే స్థానంపై అధిష్టానం కసరత్తు బీసీ మహిళా కోటాలో విజయశాంతికి అవకాశం. మంత్రి కొండా సురేఖ వ్యవహారం కాంగ్రెస్ అధిష్టానం పరిశీలనకు చేరిన నేపథ్యంలో తెలంగాణ రాజకీయాల్లో మంత్రి పదవిపై కొత్త చర్చ మొదలైంది. సురేఖను మంత్రివర్గం నుంచి తప్పిస్తే, ఆమె స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలనే దానిపై కాంగ్రెస్ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.మహిళా ప్రాతినిధ్యం, సామాజిక సమీకరణాలు, పార్టీ విధేయత వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో బీసీ సామాజికవర్గానికి చెందిన సీనియర్ నాయకురాలు, ఎమ్మెల్సీ విజయశాంతి పేరు ప్రధానంగా వినిపిస్తోంది.సురేఖ స్థానంలో బీసీ మహిళకు అవకాశం కల్పించే అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతుండగా, విజయశాంతి తన అభ్యర్థిత్వాన్ని పార్టీ పెద్దల వద్ద వినిపిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.గతంలో తనకు మంత్రి పదవి ఇస్తామని పార్టీ పెద్దలు హామీ ఇచ్చారనే అంశాన్ని విజయశాంతి వర్గాలు గుర్తు చేస్తున్నట్లు సమాచారం. ఢిల్లీ స్థాయిలో ఆమెకు అనుకూలంగా లాబీయింగ్ జరుగుతున్నట్లు ప్రచారం ఊపందుకోవడంతో, కొండా సురేఖ స్థానంలో రాములమ్మకు అవకాశం దక్కుతుందా? అనే చర్చ కాంగ్రెస్ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది.అయితే సురేఖపై తుది నిర్ణయం వెలువడిన తర్వాతే మంత్రి పదవి భర్తీపై అధికారిక స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం విజయశాంతి పేరు ఆశావహుల జాబితాలో ప్రముఖంగా వినిపిస్తోంది.

## బోడుప్పల్లో మైనింగ్ ఏడీ ఇంటి పై ఏసీబీ దాడులు.. ఏకకాలంలో 8 ప్రాంతాల్లో తనిఖీలు




ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో భూగర్భజలవనరుల శాఖకు చెందిన మైనింగ్ ఏడీ జయరాజు నివాసం పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు నిర్వహిస్తున్నారు. బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్నగర్లోని ఆయన నివాసంతో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జయరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనింగ్ ఏడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆయన తన అధికారిక ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. జయరాజుకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఆస్తుల పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలను అధికారులు ఇప్పటి వరకు లభించినవి..సోదాల్లో ఇప్పటివరకు రెండు కార్లు, రూ.1.50 లక్షల నగదు, రెండు పుస్తకాలు, జనగామ జిల్లాలోని 5 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు, ఫిక్స్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లకు సంబంధించిన వివరాలు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా పూర్తి కాకపోవడంతో మొత్తం ఆస్తుల విలువ, ఇతర కీలక పత్రాలు లేదా నగదు, బంగారం తదితర వివరాల పై స్పష్టత రావాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాలు, ఇతర వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. సోదాలు కొనసాగుతుండటంతో పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉంది.బోడుప్పల్లో మైనింగ్ ఏడీ ఇంటి పై ఏసీబీ దాడులు.. ఏకకాలంలో 8 ప్రాంతాల్లో తనిఖీలుఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల నేపథ్యంలో భూగర్భజలవనరుల శాఖకు చెందిన మైనింగ్ ఏడీ జయరాజు నివాసం పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు గురువారం ఉదయం సోదాలు నిర్వహిస్తున్నారు. బోడుప్పల్ ఈస్ట్ హనుమాన్నగర్లోని ఆయన నివాసంతో పాటు మొత్తం 8 ప్రాంతాల్లో ఏకకాలంలో తనిఖీలు చేపట్టినట్లు సమాచారం. ప్రస్తుతం జయరాజు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మైనింగ్ ఏడీగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఆయన తన అధికారిక ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారన్న ఆరోపణల పై ఏసీబీ అధికారులు ఈ దాడులు చేపట్టినట్లు సమాచారం. హైదరాబాద్ ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సాయి మనోహర్, వరంగల్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. జయరాజుకు సంబంధించిన ఇళ్లు, కార్యాలయాలు, ఆస్తుల పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఆర్థిక లావాదేవీలు తదితర అంశాలను అధికారులు ఇప్పటి వరకు లభించినవి..సోదాల్లో ఇప్పటివరకు రెండు కార్లు, రూ.1.50 లక్షల నగదు, రెండు పుస్తకాలు, జనగామ జిల్లాలోని 5 ఎకరాల వ్యవసాయ భూమికి సంబంధించిన వివరాలు, ఫిక్స్ డిపాజిట్లు, పోస్టల్ డిపాజిట్లకు సంబంధించిన వివరాలు అధికారులు గుర్తించినట్లు సమాచారం. అయితే సోదాలు ఇంకా పూర్తి కాకపోవడంతో మొత్తం ఆస్తుల విలువ, ఇతర కీలక పత్రాలు లేదా నగదు, బంగారం తదితర వివరాల పై స్పష్టత రావాల్సి ఉంది. సోదాలు పూర్తయిన అనంతరం ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న ఆస్తులు, పత్రాలు, ఇతర వివరాలను వెల్లడించే అవకాశం ఉంది. సోదాలు కొనసాగుతుండటంతో పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడికావాల్సి ఉం

# హత్యకేసులో ఇద్దరు అరెస్టు

గుంటూరు... .నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో ఏకో పార్క్ వద్ద పెట్రోల్ పోసి హత్య చేసిన ఇద్దరు నింధితులను అరెస్ట్ చేసామని సౌత్ డీఎస్పీ పూర్ణ చంద్రరావు వెల్లడించారు. 14 వ తేదీన మృతుని తల్లి శాంతమ్మ కనిపించడం లేదని ఇచ్చిన ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీస్ స్టేషన్ మిస్సింగ్ కేసు నమోదు చేశారు. నిందితుడు బుల్లయ్య కి తురకపాలెం కి చెందిన మహిళతో వివాహేతర సంబంధం ఉంది. అదే మహిళతో మృతుడు ప్రసన్న కు వివాహేతర సంబంధం ఉందని అనుమానం. ఆ కారణంగానే మృతుడు ప్రసన్న ను మద్యం సేవించేందుకు ఇంటి నుండి తీసుకొని వెళ్ళాడు. నల్లపాడు రోడ్డు జనచైతన్య ఫ్లాట్ లలో ఏకో పార్కు సమీపంలో రాయితో తల పై నిందితులు కొట్టి చంపారు. ఆధారాలు లేకుండా చేయడానికి శవాన్ని పెట్రోల్ పోసి తాగులబెట్టిన వైనం .మృతదేహం శరీరం పై బట్టలను తల్లి శాంతమ్మ చూసి గుర్తు పట్టడంతో చనిపోయింది ప్రసన్న అని పోలీసులు గుర్తించారు. నిందితులను అరెస్ట్ చేసి విచారించగా హత్య చేసినట్టు ఒప్పుకున్నారని అయన అన్నారు.

# నటుడు నారాయణ రావు మృతి



హైదరాబాద్ ప్రముఖ సీనియర్ నటుడు, నిర్మాత జీవీ నారాయణ రావు (73) కన్నుమూసారు. గత కొన్నాళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, బుధవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆయన మృతికి సినీ ప్రముఖులు సంతాపం ప్రకటించారు. కృష్ణా జిల్లా, కురుమద్దాలి గ్రామంలో జన్మించిన నారాయణరావు, 1976 లో వచ్చిన అంతులేని కథ సినిమా ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు. దాదాపు సినిమాలలో పైగా నటించారు. పలు టి.వి.సీరియళ్లలో కూడా నటించారు. మద్రాస్ ఫిలిం ఇన్స్టిట్యూట్ లో శిక్షణ తీసుకున్నారు. రజనీకాంత్,చిరంజీవి కి నారాయణరావు మంచి మిత్రులు. అంతులేని కథ, ముత్యాల పల్లకి, అంగడి బొమ్మ , చిలకమ్మ చెప్పింది , గ్యాంగ్ లీడర్, హిట్లర్ వంటి సినిమాల్లో నటించారు. దేవాంతకుడు, ఇంటికో రుద్రమ్మ , యముడికి మొగుడు, పెళ్ళినీకు శుభం నాకు సినిమాలను నిర్మించారు. నారాయణ రావు చివరి చిత్రం “ఆలోచన”

## కామారెడ్డిలో ఉద్రిక్తత.. పోలీసులతో బీఆర్ఎస్ శ్రేణుల తోపులాట

కామారెడ్డి పట్టణంలో గత ఏడాది ఇదే రోజున కురిసిన భారీ వర్షాలకు తీవ్రంగా దెబ్బతిన్న రోడ్లు, డివైడర్లు ఏడాది గడిచినా ఇప్పటికీ మరమ్మతులకు నోచుకోకపోవడంపై బీఆర్ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేశాయి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా కామారెడ్డికి వచ్చి హామీ ఇచ్చినా, ఇప్పటివరకు పనుల్లో ఎలాంటి పురోగతి లేకపోవడం, స్థానిక ఎమ్మెల్యే సైతం సమస్యను పట్టించుకోకపోవడాన్ని నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వానికి, స్థానిక ఎమ్మెల్యేకు పిండ ప్రదానం నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు ప్రయత్నించడంతో బీఆర్ఎస్ శ్రేణులకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకుని కామారెడ్డిలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.ఏడాది గడిచినా హామీలు అమలు కాకపోవడంపై ప్రజల తరపున ప్రభుత్వాన్ని నిలదీస్తున్నామని బీఆర్ఎస్ శ్రేణులు స్పష్టం చేశాయి.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి.

మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టొద్దు. ప్రభుత్వ పరిధిలోనే మన కరెంటు ఉండాలి.తెలంగాణ రాష్ట్రంలో గృహ విద్యుత్ కనెక్షన్లకు ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న తెలంగాణ ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా ప్రతిఘటిస్తాం.సెల్ ఫోన్లు రీ ఛార్జ్ చేసుకున్నట్టు కరెంట్ మీటర్లు రీ ఛార్జ్ చేసుకుంటేనే కరెంట్ సరఫరా చేస్తామనడం ఆ ప్రజాస్వామికమైన చర్య.ఉచిత కరెంట్ ను ఎత్తివేసేందుకే స్మార్ట్ మీటర్లు తెరపైకి తెస్తున్నారు.మన కరెంట్ ను అదానీ చేతుల్లో పెట్టవద్దు.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలి. బండారు లక్ష్మారెడ్డి డిమాండ్. ఏకపక్ష నిర్ణయాలతో కరెంటు మీటర్లను ఏర్పాటు చేస్తే ప్రజా గ్రహానికి గురి కావలసి వస్తుంది.

## క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఎజెండా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



హైదరాబాద్ ప్రధాని మోడీ నాయకత్వంలో క్రీడలను ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఎజెండాగా ఉంది. గతంలో క్రీడల పట్ల నిర్లక్ష్యం ఉండేదని, రాజకీయ జోక్యం వల్ల ప్రతిభ ఉన్న నిజమైన క్రీడాకారులకు తగిన అవకాశాలు దక్కేవవి కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించేందుకు చేపట్టిన కార్యక్రమాల్లో భాగంగా, దేశవ్యాప్తంగా ఉన్న 1500 విద్యా సంస్థల విద్యార్థులు మరియు యువ క్రీడాకారులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆన్లైన్ ద్వారా మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దాదాపు 10 లక్షల మంది విద్యార్థులు పాల్గొన్నారు.

మంత్రి మాట్లాడుతూ మన దేశంలో ప్రపంచంలోనే అత్యధిక యువత మరియు విద్యార్థుల జనాభా ఉన్నప్పటికీ, గతంలో క్రీడలను విస్మరించారు. కానీ నేడు పరిస్థితి మారుతూ ఉంది. కింది స్థాయి నుంచే క్రీడలను ప్రోత్సహించేందుకు ప్రధాని శ్రీకారం చుట్టడంతో, అంతర్జాతీయ పోటీల్లో మన దేశం ఎక్కువ పతకాలు సాధిస్తోందని పేర్కొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు వెళ్లే ప్రతీ క్రీడాకారుడిని ప్రధాని మోడీ స్వయంగా కలుస్తారు. ఎవరైనా గెలిస్తే తల్లిదండ్రులు లేదా కోచ్ల కంటే ముందే స్వయంగా ఫోన్ చేసి అభినందిస్తారు. ఒకవేళ ఓడిపోయినా సరే, క్రీడాకారులు నిరుత్సాహ పడకుండా వారికి ధైర్యం చెబుతూ అండగా నిలుస్తున్నారు.

క్రీడాకారులకు కావలసిన పౌష్టికాహారాన్ని అందించడంతో పాటు, వారికి నచ్చిన దేశంలో, నచ్చిన కోచ్లతో శిక్షణ ఇప్పించేందుకు ప్రభుత్వం అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తోంది. దేశంలోని యువజనాభా ప్రాతిపదికన క్రీడల్లో అత్యధిక పతకాలు సాధించాలన్నదే ప్రధాని లక్ష్యమని అన్నారు.

భారతదేశం 2030 కామన్వెల్త్ గేమ్స్కు ఆతిథ్యం ఇవ్వబోతోంది. అలాగే 2036 ఒలింపిక్స్ మన దేశంలో జరిగేలా విదేశాలతో చర్చలు జరుపుతూ గట్టి ప్రయత్నాలు చేస్తున్నాము. అప్పటికల్లా ప్రపంచ దేశాలతో సమానంగా క్రీడా రంగంలో భారత్ ముందుండాలనేది మన ప్రయత్నం. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల అధినేతలు అందరూ చదువుతో పాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలి. అందరం కలిసికట్టుగా ప్రయత్నిస్తే రానున్న రోజుల్లో ప్రపంచ క్రీడా చిత్రపటంలో భారతదేశం అగ్రస్థానానికి చేరుకోవడం తథ్యం అని మంత్రి పిలుపునిచ్చారు.

# నకిలీ వైద్యుల ఉచ్చులో పడకండి.. అప్రమత్తంగా ఉండండి సీపీ సజ్జనార్



హైదరాబాద్ వైద్యం పేరిట అమాయక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న నకిలీ వైద్యుల పట్ల ప్రజలంతా అత్యంత అప్రమత్తంగా, జాగ్రత్తగా ఉండాలని విజ్ఞప్తి చేస్తున్నానని నగర పోలీసు కమిషనర్ వి సీ సజ్జనార్ అన్నారు.

ప్రజారోగ్యాన్ని కాపాడేందుకు కట్టుబడిన హైదరాబాద్ పోలీసులు ఇప్పటికే కల్తీ ఆహారంపై ఉక్కుపాదం మోపుతున్నాం. తాజాగా నగరంలో ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న నకిలీ వైద్యులపై ప్రత్యేక నిఘా పెట్టడం జరిగింది. 12 మంది నకిలీ వైద్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకున్నాం. ఎలాంటి విద్యార్హతలూ, కనీస వైద్య పరిజ్ఞానం లేని వీరు అసలైన వైద్యుల తరహాలోనే నటిస్తూ రోగులకు యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్లు, బీపీ, మధుమేహం మందులతో పాటు విచక్షణారహితంగా ఇంజెక్షన్లు, సెలైన్లు ఎక్కిస్తూ ఆరోగ్యాన్ని తీవ్ర ప్రమాదంలోకి నెడుతున్నారు. అవగాహనారాహిత్యంతో రోజుల తరబడి మందులు వాడాలని సూచించడంతో ప్రజల ఊపిరితిత్తులు, గుండె, మూత్రపిండాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయి.ఇలాంటి మోసగాళ్లపై మా నిఘా, కఠిన చర్యలు కొనసాగుతుండగా.. ప్రజలు కూడా చికిత్స కోసం వెళ్లే ముందు కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించాలని అన్నారు.

తాము వెళ్లే క్లినిక్లు, ఆసుపత్రుల రిసెప్షన్ వద్ద జిల్లా వైద్యారోగ్య శాఖ (ఆఓఊా) జారీ చేసిన అధికారిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ను ప్రముఖంగా ప్రదర్శించారో లేదో గమనించాలి. అలాగే వైద్యుల బోర్డులపై పేరు, విద్యార్హతలతో పాటు తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టాఓఅ) కేటాయించిన రిజిస్ట్రేషన్ నంబర్ తప్పనిసరిగా ఉండాలి. చికిత్స విధానం లేదా సిబ్బంది ప్రవర్తనపై ఏమాత్రం అనుమానం వచ్చినా తక్షణం అర్హత గల ఇతర నిపుణులైన వైద్యుల వద్ద రెండో అభిప్రాయం (సావఞనీనిట రాజూతినితినీని) తీసుకోవాలి. ఎక్కడైనా నకిలీ వైద్యులు చలామణి అవుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే ఆలస్యం చేయకుండా డయల్ 112కు లేదా సమీప పోలీస్ స్టేషన్కు తెలియజేసి అమాయకుల ప్రాణాలను కాపాడాలని కోరుతున్నానని అన్నారు.

## అడ్డగోలుగా ఫీజులు పెంచి పిల్లల భవిష్యత్తు ఆగం చేస్తున్నారు హరీష్ రావు

హన్మకొండ సుబేదారి పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మీడియాతో హరీష్ రావు మాట్లాడారు. స్కిల్ యూనివర్సిటీని పీపీటీ మోడల్లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను స్కిల్ యూనివర్సిటీలో కలపడం అంటే ప్రైవేటు పరం చేయడమేనని అన్నారు.

ఎందుకు ఆగం చేస్తున్నావ్ పిల్లలను. పాలిటెక్నిక్ విద్యార్థులు రూ.పదిహేను వేలు కడితే చదువు పూర్తవుతుంది. స్కిల్ యూనివర్సిటీలో కలిపి అడ్డగోలుగా ఫీజులు పెంచి పిల్లల భవిష్యత్తు ఆగం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి నిర్ణయంతో మా పిల్లల భవిష్యత్తు ఆగం అవుతోంది.. ఇప్పటికే పది మంది విద్యార్థుల తల్లిదండ్రులు టీసీ తీసుకుని వెళ్లిపోయారని అన్నారు.

# 10 నిమిషాల మందు.. 30 సెకన్ల వైద్యం?

## (హెచ్.ప్రతాప్)

అర్ధరాత్రి అయినా, తెల్లవారుజామున అయినా మందు కావాలంటే చాలు. క్విక్-కామర్స్ యాప్‌లో ఆర్డర్ చేస్తే పది నిమిషాల్లోనే ఇంటి గుమ్మానికి ఔషధాలు చేరుతున్నాయి. సమస్య ప్రిస్క్రిప్షన్ మందుల దగ్గర మొదలవుతోంది. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ లేకపోయినా ఆందోళన అవసరం లేదన్నట్టుగా 'డాక్టర్ ఆన్ కాల్' సదుపాయం అందుబాటులోకి వస్తోంది. కొన్ని సందర్భాల్లో 30 సెకన్లలోనే వైద్యుడి ఫోన్ కాల్, ఆ వెంటనే డిజిటల్ ప్రిస్క్రిప్షన్! సౌకర్యంగా కనిపిస్తున్న ఈ విధానం ఆరోగ్యరంగంలో కొత్త ప్రశ్నలను లేవనెత్తుతోంది.

మందుల విషయంలో వేగం కంటే సరైన నిర్ధారణ, సరైన మోతాదు, సరైన వ్యవధి ముఖ్యం. రోగిని ప్రత్యక్షంగా పరీక్షించకుండా, అతని పాత వైద్య చరిత్ర, ఇతర మందుల వినియోగం, అలర్జీలు, రక్తపోటు, మూత్రపిండాలు లేదా కాలేయ పనితీరు వంటి అంశాలను సమగ్రంగా అంచనా వేయకుండా కేవలం కొన్ని ప్రశ్నల ఆధారంగా ప్రిస్క్రిప్షన్ ఇవ్వడం ప్రమాదకరంగా మారవచ్చు.

ముఖ్యంగా యాంటీబయాటిక్స్, స్టెరాయిడ్స్, నిద్రమాత్రలు, నొప్పి నివారణ మందులు వంటి ఔషధాలను స్వయంగా కొనుగోలు చేసే అవకాశం పెరిగితే దుష్ప్రభావాలు మాత్రమే కాదు, యాంటీబయాటిక్ నిరోధకత వంటి ప్రజారోగ్య సమస్యలు కూడా తీవ్రమవుతాయి. తాత్కాలికంగా లక్షణాలు తగ్గిపోవడంతో అసలు వ్యాధి నిర్ధారణ ఆలస్యమయ్యే ప్రమాదమూ ఉంది.

ఇక్కడ మరో ముఖ్యమైన ప్రశ్న వైద్యుడి స్వతంత్ర నిర్ణయానికి సంబంధించినది. కొన్ని సెకన్లలో ముగిసే సంప్రదింపులో అవసరమైన వైద్య సమాచారాన్ని పూర్తిగా సేకరించడం సాధ్యమేనా? ఒక డిజిటల్ ప్రిస్క్రిప్షన్ పంపడం వైద్య పరీక్షకు ప్రత్యామ్నాయం కాదనే విషయం వినియోగదారులు గుర్తించాలి.

క్విక్-కామర్స్ సాంకేతికత ఆరోగ్య సేవలను అందుబాటులోకి తీసుకురావడంలో ఉపయోగపడవచ్చు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన ఔషధాలు వేగంగా అందడం నిజంగా ప్రయోజనకరం. కానీ 'వేగవంతమైన డెలివరీ'ని 'వేగవంతమైన వైద్యం'గా మార్చడం ప్రమాదకరం.

ఆరోగ్యరంగంలో సౌకర్యానికి హద్దులు ఉండాలి. ప్రిస్క్రిప్షన్ మందులపై కఠినమైన నియంత్రణ, వైద్యుడి బాధ్యత, రోగి భద్రతకు ప్రాధాన్యం ఉండాలి. పది నిమిషాల్లో మందు రావడం గొప్ప సాంకేతిక విజయం కావచ్చు; కానీ సరైన మందు కోసం సరైన వైద్య నిర్ణయం తీసుకోవడానికి అవసరమైన సమయాన్ని మాత్రం 30 సెకన్లకు కుదించకూడదు.

# ఇండ్ల స్థలాల సాధనకై జర్నలిస్టుల పాదయాత్ర.

### ప్రభుత్వం వెంటనే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

### తల్లాడ సభలో రాజకీయ పార్టీల నేతలు

**ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు 27 ప్రజాబలం:**ప్రజలకు ప్రభుత్వానికి వారధిగా ఉండి ప్రజా సమస్యలు తీర్చే జర్నలిస్టులే వారి సమస్యల పరిష్కారానికి కోసం రోడ్ ఎక్కారని, ప్రభుత్వం తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సిపిఎం నాయకులు ఐయినాల రామలింగేశ్వరరావు డిమాండ్ చేశారు. టి డబ్ల్యూ జేఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సత్తుపల్లి నియోజకవర్గంలో గురువారం తల్లాడ మండల కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా నవ తెలంగాణ రిపోర్టర్ ముస్తఫా అధ్యక్షతన తల్లాడ మండల






కేంద్రంలో పాదయాత్ర నిర్వహించి తల్లాడ తహసిల్దార్ కరుణాకర్ కి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా అధ్యక్షులు సయ్యద్ ఖదీర్ మాట్లాడుతూ మండల కేంద్రంలో అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తహసిల్దార్. మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి జర్నలిస్టు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో టిఆర్ఎస్ తల్లాడ సర్పంచ్ పెరిక నాగేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ నాయకులు బి. శ్రీనివాసరావు, బిజెపి నాయకులు చల్లా నాగులు మాట్లాడుతూ జర్నలిస్టుల న్యాయమైన కోరికలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇళ్ల స్థలాలు, భద్రత, ఆరోగ్య కార్లు, జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్య ప్రతిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించకపోతే జర్నలిస్టు చేసే ఉద్యమాన్ని ఉధృతం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి .రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, సయ్యద్ ఖదీర్, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టిబిజేఏ జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలబోల మధుశ్రీ, , రాష్ట్ర ఈసీ మెంబర్ టి.ఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరికొప్పుల రాంబాబు, పీజీబీఏ కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# చిలుముల కిషన్ రెడ్డికి ఘన నివాళి

**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి అగస్ట్ 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** బడుగు జీవుల నేత దివంగత చిలుమల కిషన్ రెడ్డి, 8 వర్ధంతి కౌడిపల్లి, గ్రామంలో ఘనంగా జరిగింది. గురువారం నాడు కౌడిపల్లి మండల కేంద్రంలోని కిషన్ రెడ్డి స్మారక వనం వద్ద ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ చిలుముల





సుహాసిని రెడ్డి, పూలమాలలు వేసి కిషన్ రెడ్డికి, శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా జోహార్ కిషన్ రెడ్డి నినాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. పేద ప్రజల కడుపు నింపే నేతగా కిషన్ రెడ్డి,పేరు తెచ్చుకున్నారని చిలుముల సుహాసినిరెడ్డి,కొనియాడారు,ఈకార్యక్రమంలోకొల్చారం మాజీ ఎంపీపీ సావిత్రి రెడ్డి, మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి పుల్లబోయిన దుర్గేష్, ముదిరాజ్, నాయకులు రాధాకృష్ణ, శ్రీశైలం, రషీద్, నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కిషన్ రెడ్డి, అభిమానులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా సవరణపై అనేక సందేహాలు

### అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలి

### దమ్మాయిగూడ బిజెపి నాయకులు గాలి సంపత్ యాదవ్

మేడ్చల్ ఆగస్ట్ 27 :ఎస్ ఐ ఆర్ ఓటర్ల జాబితా సవరణపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయని, అర్హులైన ఒక్క ఓటు కూడా కోల్పోకుండా ఎన్నికల సంఘం తక్షణ చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ
మేడ్చల్ రూరల్ జిల్లా
దమ్మాయిగూడ బిజెపి నాయకులు గాలి సంపత్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.దమ్మాయిగూడ డివిజన్--4లో SIR Âoండో విడత





సమగ్ర ఓటర్ల జాబితా సవరణలో భాగంగా దమ్మాయిగూడ ఓల్డ్ విలేజ్ రామాలయం ప్రాంగణంలో నిర్వహించిన ఓటర్ల జాబితా గ్రామసభలో పాల్గొని, వివిధ పోలింగ్ బూత్‌లకు సంబంధించిన ఓటర్ల జాబితాలను పరిశీలించడం జరిగింది.

దమ్మాయిగూడ డివిజన్‌లోని 39 పోలింగ్ బూత్‌లలో గతంలో సుమారు 48,000 మంది ఓటర్లు ఉండగా, ప్రస్తుతం సుమారు 33,000 మంది మాత్రమే ఉన్నట్లు పరిశీలనలో వెల్లడైంది. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు వంటి కారణాలతో కొన్ని ఓట్లు తొలగించబడటం సహజమైన ప్రక్రియ అయినప్పటికీ, అర్హత కలిగిన నిజమైన ఓటర్ల విషయంలో మాత్రం ఎలాంటి అన్యాయం జరగకూడదు.

ప్రస్తుతం సుమారు 33,000 మంది ఓటర్లలో కేవలం 9,000 మంది వివరాలు మాత్రమే క్లియర్‌గా పూర్తయినట్లు, మిగిలిన సుమారు 24,000 మందికి నోటీసులు జారీ అయినట్లు అధికారులు తెలిపిన పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది.

ముఖ్యంగా, గతంలోనుంచి ఓటరు జాబితాలో ఉన్నవారు, సరైన చిరునామా మరియు వివరాలు అందించినప్పటికీ కొందరికి నోటీసులు రావడం, నోటీసులు అందుకున్న వారికి ఒక్కో ప్రాంతంలో ఒక్కో గడువు ఇవ్వడం వంటి అంశాలపై స్పష్టత అవసరం.

ఒక ముఖ్యమైన ప్రశ్న -- నోటీసు ఈరోజు అందించి, రేపే ఆధారాలు సమర్పించాల్సిందిగా గడువు ఇస్తే, సాధారణ ఓటరు అంత తక్కువ సమయంలో అవసరమైన పత్రాలను ఎలా సమర్పించగలరు?

అదీ కాకుండా పండుగ రోజు కావడం, కొంతమంది ఓటర్లు ఇతర ప్రాంతాల్లో ఉండటం, ఫోన్‌లో సంప్రదించలేకపోవడం వంటి అనేక ప్రాక్టికల్ సమస్యలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో గడువు ముగిసిన కారణంగా నిజమైన భారత పౌరుడి ఓటు హక్కు కోల్పోయే పరిస్థితి మాత్రం రాకూడదు.

ఇక్కడ పనిచేస్తున్న BLO\T, BLA-2లు తమ పరిధిలో సాధ్యమైనంత వరకు ప్రయత్నం చేస్తున్నారు. వారిని తప్పుపట్టడం మా ఉద్దేశం కాదు. అయితే, వారికి కూడా స్పష్టమైన మార్గదర్శకాలు, నోటీసులు అందుకున్న ఓటర్ల పూర్తి సమాచారం, ఆన్‌లైన్‌లో పత్రాలు ఎలా అప్లోడ్ చేయాలి, ఏ ఆధారాలు స్వీకరించాలి వంటి అంశాలపై సరైన శిక్షణ మరియు వ్యవస్థ అవసరం.

అలాగే, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ బూత్‌లలో ఉండటం, చిరునామా మార్పులు, కొత్తగా 18 సంవత్సరాలు నిండిన అర్హులైన యువతకు అవకాశం కల్పించడం వంటి అంశాలు కూడా సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని అన్నారు.

SIR అంటే కేవలం ఓట్లు తొలగించడం మాత్రమే కాదు -- అర్హులైన ప్రతి భారత పౌరుడి పేరు సరైన వివరాలతో ఓటర్ల జాబితాలో ఉండేలా చూడటం కూడా ఎన్నికల సంఘం బాధ్యత.

కాబట్టి ఎన్నికల సంఘం మరియు సంబంధిత అధికారులు:

నోటీసులు అందుకున్న ఓటర్లకు తగినంత సమయం ఇవ్వాలి.

సరైన ఆధారాలు ఉన్నప్పటికీ నోటీసులు వచ్చిన కేసులను ప్రత్యేకంగా పరిశీలించాలి.

ప్రతి దీూాకు స్పష్టమైన మార్గదర్శకాలు, అవసరమైన సాంకేతిక సహాయం అందించాలి.

నోటీసులు అందుకున్న ప్రతి ఓటరును సంప్రదించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

ఒకే కుటుంబంలోని ఓటర్ల వివరాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన చోట సరైన పోలింగ్ బూత్‌కు అనుసంధానం చేయాలి.

అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా కేవలం సాంకేతిక లేదా ప్రక్రియాపరమైన సమస్యల వల్ల ఓటు హక్కును కోల్పోకుండా చూడాలి.

గ్రామసభలు, ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన సమాచారాన్ని ముందుగానే ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలి.

ఓటు హక్కు ఒక సాధారణ హక్కు కాదు -- ప్రజాస్వామ్యానికి అది పునాది.

SIR ప్రక్రియలో ఎక్కడైనా లోపాలు ఉంటే వాటిని సరిదిద్ది, నిజమైన ఓటర్లకు పూర్తి న్యాయం జరిగేలా ఎన్నికల సంఘం, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చొరవ తీసుకోవాలి.

"అర్హుడైన ఒక్క ఓటరు కూడా మిగలకూడదు... అనర్హుడైన ఒక్క ఓటు కూడా ఉండకూడదు" అనే సూత్రంతో పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఓటర్ల జాబితా సవరణ జరగాలని గాలి సంపత్ యాదవ్ విజ్ఞప్తి చేశారు.

# భుచన్ పల్లిఎస్ ఐ ఆర్ వార్డు సభ్యులసమావేశంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి

## ప్రజాస్వామ్య దేశంలో ఓటు అనేది ఒక విలువైనఆయుధం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం భూచన్పల్లి గ్రామంలో వార్డు సభ్యుల సమావేశంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి గ్రామంలో ఎస్ ఐ ఆర్ సర్వేలో ప్రతి గృహాన్ని దర్శించి ప్రతి ఒక్కరు కూడా సర్వేలో పూర్తిస్థాయిలో వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పడం జరిగింది సమావేశం ఏర్పాటు చేసి కూడా చెప్పడం జరిగింది వేరే గ్రామాల్లో ఉన్నటువంటి వారు కూడా స్థానిక గ్రామంలో తప్పనిసరిగా మీ పేరుతో వివరాలు నమోదు చేసుకోవాలని చెప్పడం జరిగిందని గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి తెలిపారు భూషణ్ పల్లి గ్రామంలో 100% పేర్లు వివరాలతో నమోదు చేయడం జరిగింది ఐడి ప్రూఫ్ లాంటి చిన్న చిన్న మిస్టేక్స్ ఏమైనా ఉంటే పూర్తిస్థాయిలో అన్ని సరిచేసి అధికారులకు నివేదిక పంపించడానికి పూర్తిస్థాయి నా వంతు సహాయ సహకారాలు మా గ్రామ ప్రజలకు ఎల్లవేళలా ఉంటాయి అదే విధంగా గ్రామంలో ఏ ఒక్కరు కూడా ఓటు హక్కు కోల్పోకూడదు అని అధికారులకు సూచించారు అదేవిధంగా మీ దగ్గర ఉన్న పత్రాలు నాకు పంపించినట్టయితే తప్పనిసరిగా మీ పేర్లు పూర్తి స్థాయిలో వివరాలతో నమోదు చేసి ఓటు హక్కు కోల్పోకుండా నా వంతు బాధ్యతగా కృషి చేస్తానని గ్రామ సర్పంచ్ వెంకటరామిరెడ్డి తెలిపారు ఎస్ ఐ ఆర్సర్వే ప్రకారం గ్రామ సెక్రెటరీ లాలు గ్రామ వార్డు సభ్యుల సమావేశంలో పేర్లు చదివి వినిపించడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో గ్రామ పెద్దలు కందడి సుధాకర్ రెడ్డి, కందడి వేణుగోపాల్ రెడ్డి, కాందడి మహేందర్ రెడ్డి, కందడి విష్ణువర్ధన్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,ఆకుల రాములు, ఉప్పరి నర్సింలు ,షాపురం ప్రభాకర్ రెడ్డి ,వార్డు సభ్యులు యువజన సంఘం నాయకులు మహిళా సోదరులు గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొని సమావేశం విజయవంతం చేశారని తెలిపారు

# జిల్లాలో వేరుశనగ విత్తన 100% సబ్సిడీ పంపిణీలో జరిగిన అవినీతి పైన సమగ్రమైన విచారణ జరిపి దోస్తులను శిక్షించాలి..

## దేవనకొండలో ఏపీ రైతు సంఘం (ఏఐకెఎస్) ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళన..

దేవనకొండ జిల్లాలో సబ్సిడీ వేరుశనగ పంపిణీలో జరిగిన అవకతవకలు, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని ఏపీ రైతు సంఘం (ఏఐకెఎస్) మండల నాయకులు రామాంజనేయులు వెంకటరాముడు డిమాండ్ చేశారు. గురువారం ఏపీ రైతు సంఘం (ఏఐకెఎస్) ఆధ్వర్యంలో దేవనకొండ వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు రైతులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో ఇంత పెద్ద మొత్తంలో వ్యవసాయ శాఖలో అవినీతి జరిగిన కూడా ఇంతవరకు ఎవరిపైన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రైతులకు సబ్సిడీపై ఇవ్వవలసిన విత్తనాలను అధికారులు అమ్ముకుంటే అడిగేవారు లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం 100% సభ్యుడితో "విశిష్ట వేరుశనగ విత్తనాలను" రైతులకు ఉచితంగా ఇవ్వాలని తెలియజేసిందన్నారు. దీనిని దొంగ చాటుగా అధికారులు అమ్ముకున్నారన్నారు. రైతులకు ఈ స్కీం వచ్చినట్లు గాని లేదా ఈ విధంగా ఇచ్చినట్లు గాని ప్రకటనల ద్వారా గాని లేదా మీడియా ద్వారా గాని వ్యవసాయ అధికారులు ఎవరికీ తెలియజేయలేదన్నారు.



మండల స్థాయిలో, జిల్లా స్థాయిలో ఉన్న అధికారులు కుమ్మక్కై ఈ చర్యకు పూనుకున్నారన్నారు. దీనిపైన సమగ్రమైన విచారణ జరిపించాలని అవినీతి జరిగిందని వెలుగులోకి వచ్చిన విషయం బయటికి వచ్చినప్పటికీ కర్నూలు జిల్లా కలెక్టర్ కాంప్లెక్స్ లో ఇంత అన్యాయం జరుగుతున్నా కూడా దీనిని అడిగే వారు లేకుండా పోతున్నారని అన్నారు. సబ్సిడీలు, సంక్షేమ కార్యక్రమాలు, ఉచితాలు ఎన్ని వస్తున్నాయో ఎవరికీ తెలియకుండా, చెప్పకుండా గుట్టు చప్పుడు కాకుండా అమ్ముకుంటున్నారన్నారు. ఇంత తీవ్రమైన కరువు పరిస్థితుల్లో ఉన్నందువలన కేంద్ర ప్రభుత్వం 2025 వ సంవత్సరం ఖరీఫ్, రబీకి మరియు 2020 సంవత్సరం ఖరీఫ్ కు విత్తనాలు ఇస్తే వాటిని కూడా దొంగచాటుగా అమ్ముకున్నారన్నారు. తక్షణమే సమగ్రమైన విచారణ జరిపించాలన్నారు. ఈ సొమ్మును రికవరీ చేయాలన్నారు. నేరస్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. అవకతవకలు పాల్పడినట్లు తేలిన వారిని సస్పెండ్ చేయాలన్నారు. జిల్లా స్థాయి అధికారులకు పంపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులేమైనా టెర్రరిస్టులా? పాలిటెక్నిక్ పిల్లల గొంతులు పిసుకుతారా?

**స్కిల్ యూనివర్సిటీ పేరుతో లక్ష మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటం.**
**జీవో 97 రద్దు చేయాలి.. ఏ**
**పీ, ఢిల్లీ తరహాలో తప్పును వెనక్కి తీసుకోవాలి.**
**మమ్మల్ని అరెస్ట్ చేస్తే వరంగల్ పాలిటెక్నిక్ విద్యార్థుల సమస్యలు తీరిపోతాయా?**
**ఢిల్లీకో నీతి, తెలంగాణకో నీతి.. రాహుల్ గాంధీ ఇక్కడికొచ్చి ఎందుకు పోరాడరు?**
**మెస్ బంద్ చేసి, కాలేజీకి తాళాలు వేసి పిల్లలకు అన్నం పెట్టకుండా పోలీస్ పాలన.ఇది ప్రజా పాలన కాదు, రాక్షస, తుగ్లక్ పాలన:**
**మాజీ మంత్రి హరీశ్ రావు.**



వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ధర్నాకు మద్దతు తెలపడానికి వెళు_న్న క్రమంలో పోలీసులు తనను అక్రమంగా అరెస్ట్ చేసి సుబేదారి పోలీస్ స్టేషన్‌కు తరలించడం పట్ల మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సుబేదారి పోలీస్ స్టేషన్ వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ తీరుపై తీవ్ర స్థాయిలో మండి పడ్డారు. విద్యార్థుల గొంతు నొక్కేలా వ్యవహరిస్తున్న పోలీసుల తీరును తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ..ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు అత్యంత కర్కశంగా పాలిటెక్నిక్ విద్యార్థుల గొంతులు పిసుకుతున్నారు. అక్రమ కేసులు బనాయించి, భౌతిక దాడులకు పాల్పడుతున్నారు. ఆ పిల్లలేమైనా టెర్రరిస్టులా? లేక సంఘ విద్రోహ శక్తులా?తమ భవిష్యత్తును నాశనం చేయొద్దని, పాలిటెక్నిక్ విద్యను స్కిల్ యూనివర్సిటీలో కలపొద్దని వాళ్లు పోరాటం చేస్తుంటే.. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి వారితో చెలగాటం ఆడుతున్నారు. ముఖ్యమంత్రిగా విద్యాశాఖను మీరే అట్టిపెట్టుకోవడం రాష్ట్ర విద్యార్థుల దౌర్భాగ్యం.ఇటీవల ఇంజనీరింగ్ విద్యార్థులంతా క్రిమినల్ వేస్ట్ అని సీఎం మాట్లాడారు. అదే విద్యార్థులు ఏమంటున్నారంటే.. రేవంత్ రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం అంతకంటే క్రిమినల్ వేస్ట్ అని వాళ్లు మాట్లాడుకునే పరిస్థితి వచ్చింది.మమ్మల్ని ఎందుకు అరెస్ట్ చేశారు రేవంత్ రెడ్డి? వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు వెళ్లి ఆ పిల్లల బాధలు వినడం వల్ల మీకు వచ్చిన ఇబ్బంది ఏంటి?అసలు పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో కలపమని ఎవరైనా మీకు దరఖాస్తు ఇచ్చారా?స్కిల్ యూనివర్సిటీ అనేది పబ్లిక్ ప్రైవేట్ పార్టిసిపేషన్ ఖఖఖ మోడల్‌తో ఏర్పాటు చేశారు. దీనికి ప్రభుత్వంతో సంబంధం ఉండదు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలను అందులో కలపడం అంటే ప్రైవేటుపరం చేయడమే.ప్రస్తుతం పాలిటెక్నిక్ పిల్లలు సంవత్సరానికి కేవలం రూ.5,000 చొప్పున మూడేళ్లకు రూ.15,000 ఫీజు కడితే చదువు పూర్తవుతుంది. రేపు స్కిల్ యూనివర్సిటీలో కలిపి ప్రైవేట్ పరం చేసి అడ్డగోలుగా ఫీజులు పెంచితే ఆ పేద పిల్లల భవిష్యత్తు ఏం కావాలి..ఏఐసీటీఈ అనుమతితో చదువుతున్నారు కాబట్టే పాలిటెక్నిక్ పిల్లలకు డైరెక్ట్‌గా ఇంజనీరింగ్ సెకండ్ ఇయర్‌లో సీటు వస్తుంది. స్కిల్ యూనివర్సిటీలో కలిపితే వాళ్లు ఆ అవకాశాన్ని కోల్పోయి ఆగమైపోతారు. నీకు కనీస అవగాహన లేక ఐటీఐలతో పాలిటెక్నిక్‌ను కలపడం వల్ల వారి జీవితాలు నాశనం అవుతున్నాయి.ఒక్క వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలోనే 10 మంది విద్యార్థుల తల్లిదండ్రులు భయపడిపోయి టీసీలు తీసుకుని వెళ్లిపోయారు. రేవంత్ రెడ్డి పుణ్యమా అని ఆ పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది.రేవంత్ రెడ్డి.. ఇప్పటికైనా కళ్లు తెరువు. బేషజాలకు పోకుండా తక్షణమే జీవో 97ను రద్దు చేయాలి. పాలిటెక్నిక్ విద్యను యథావిధిగా ప్రభుత్వంలోనే నడపాలని మేం డిమాండ్ చేస్తున్నాం. మీరు వేసిన కమిటీలు దేనికి?పిల్లలు మాత్రం స్కిల్ యూనివర్సిటీలో కలపడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నారు..ప్రతిదానికీ మీ గురువుగారు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుంటావు కదా..ఏపీలోనే పాలిటెక్నిక్‌లను స్కిల్ యూనివర్సిటీలో కలిపి పొరపాటు చేశామని, పిల్లల భవిష్యత్తు దెబ్బతింటుందని నాలుక కరుచుకుని.. తిరిగి అక్కడి ప్రభుత్వం పాలిటెక్నిక్ విద్యను వెనక్కి తీసుకుంది. ఢిల్లీలో కూడా ఇలాగే ఫెయిల్ అయ్యారు. మరి ఢిల్లీ, ఏపీల్లో ఫెయిల్ అయిన ఈ చెత్త విధానాన్ని ఇక్కడ ఎందుకు రుద్దుతున్నావు..నేను రాహుల్ గాంధీని సూటిగా అడుగుతున్నాను.. ఏవో సమస్యలపై ఢిల్లీలో, బీహార్‌లో పోరాటాలు చేస్తున్నావ్. మరి తెలంగాణకు ఎందుకు వస్తలేవు? ఇక్కడ నిరుద్యోగులు, విద్యార్థులు, రైతులు రోడ్లెక్కి పోరాడుతున్నారు కద..ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం, ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం యువత కదం తొక్కుతుంటే.. ఎన్నికల ముందు లైబ్రరీల చుట్టూ తిరిగిన మీరెందుకు ఇప్పుడు రావడం లేదు రాహుల్ గాంధీ?ఢిల్లీకో నీతి, తెలంగాణకో నీతా? మీరు నిజాయితీపరులైతే ఇక్కడికొచ్చి మా పాలిటెక్నిక్ విద్యార్థులతో మాట్లాడండి. రేవంత్ రెడ్డికి మొట్టికాయలు వేసి జీవో 97ను రద్దు చేయించండి.మేం వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలకు వస్తున్నామని తెలిసి, పిల్లలకు మధ్యాహ్నం అన్నం కూడా పెట్టకుండా మెస్ బంద్ చేశారు. కాలేజీకి తాళం వేసి పిల్లలను బయటకు రాకుండా నిర్బంధించారు. ఇదా కాంగ్రెస్ ఇందిరమ్మ రాజ్యం?ఇది ప్రజా పాలన కాదు.. పోలీస్ పాలన. రాక్షస, తుగ్లక్ పాలన. బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా మేం పిల్లల వద్దకు వెళ్తే మీకు వచ్చిన నొప్పేంటి రేవంత్ రెడ్డి..రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోకపోతే, తెలంగాణలో యువతరం తిరగబడి ఢిల్లీ తరహా ఉద్యమం వస్తుంది.మహబూబాబాద్‌లో పాలిటెక్నిక్ విద్యార్థి గొంతును ఓ సీఐ పిసికాడు, సూర్యాపేటలో విద్యార్థులపై లాఠీచార్జ్ చేశారు. డీజీపీ గారూ మీరేం చేస్తున్నారు? ఇప్పటివరకు వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదు..ఆరు డీఏలు, పీఆర్సీ, హెల్త్ ఇన్సూరెన్స్ ఇలా అన్నీ పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే ప్రతిపక్షం గొంతు నొక్కుతున్నారు, అరెస్టులు చేస్తున్నారు, అక్రమ కేసులు పెడుతున్నారు.

# నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలి

## పరీక్షా కేంద్రాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లపై అధికారులకు జిల్లా ఎస్పీ డి.జానకి, ఆదేశాలు

మహబూబ్ నగర్ ఈ నెల 30.08.2026న నిర్వహించనున్న నీట్ పీజీ ప్రవేశ పరీక్ష సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేయాలని జిల్లా ఎస్పీ డి.జానకి, అధికారులను ఆదేశించారు.



నీట్ పీజీ ప్రవేశ పరీక్షకు సంబంధించి మహబూబ్నగర్లో ఏర్పాటు చేసిన జేపీఎన్సీఈ ఇంజనీరింగ్ కళాశాల మరియు ఫాతిమా విద్యాలయ పరీక్షా కేంద్రాలను జిల్లా ఎస్పీ గురువారం సందర్శించి, పరీక్షా కేంద్రాల వద్ద చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 163ఃఔూ (144 సెక్షన్) అమలులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో 200 మీటర్ల పరిధిలో జిరాక్స్ సెంటర్లు, ప్రింటింగ్ సెంటర్లు, ఆన్లైన్/మీ–సేవా కేంద్రాలు తదితర పరీక్షకు ఆటంకం కలిగించే కార్యకలాపాలు నిర్వహించకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

పరీక్షా కేంద్రాల వద్దకు అనధికార వ్యక్తులు ప్రవేశించకుండా ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ల వద్ద క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలని, అభ్యర్థులు, పరీక్షా సిబ్బంది మినహా ఇతర వ్యక్తులను అనుమతించరాదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద ట్రాఫిక్కు అంతరాయం కలగకుండా అవసరమైన ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని, అభ్యర్థులు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా మార్గదర్శక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గుంపులు గుమిగూడకుండా చర్యలు తీసుకోవడంతో పాటు, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులపై నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి సూచించారు. పరీక్షా కేంద్రాల వద్ద విధులు నిర్వహించే సిబ్బంది తమకు కేటాయించిన ప్రదేశాల్లో అప్రమత్తంగా ఉండాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయరాదని ఆదేశించారు.

అలాగే పరీక్షా కేంద్రాల వద్ద మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తదితర నిషేధిత వస్తువుల విషయంలో పరీక్షా నిర్వహణ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. పరీక్ష ప్రారంభానికి ముందు, పరీక్ష సమయంలో, పరీక్ష ముగిసిన అనంతరం కూడా భద్రతా చర్యలు కొనసాగించాలని తెలిపారు.

పరీక్షా కేంద్రాల వద్ద అఋఎ కెమెరాల పనితీరును పరిశీలించి, అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత అధికారులతో తక్షణ సమన్వయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరీక్ష ముగిసిన అనంతరం అభ్యర్థులు ఒకేసారి బయటకు వచ్చే సమయంలో ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టాలని సూచించారు.

పరీక్ష నిర్వహణలో నీట్ పీజీ నిబంధనలు, జిల్లా యంత్రాంగం మరియు పరీక్షా నిర్వాహకుల సూచనలను పోలీసు అధికారులు సమన్వయంతో అమలు చేయాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

నీట్ పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సజావుగా జరిగేలా మహబూబ్నగర్ జిల్లా పోలీసు శాఖ అన్ని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ తెలిపారు.

ఈ సందర్శనలో ఆూఖ రమణా రెడ్డి, ఏఖఔఅఇ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ ఖూ విజయ్ కుమార్, సెక్రటరీ వెంకట రామ రావు, ప్రిసిఫల్ ఆతీ.కృష్ణమూర్తి, ఖీఎ అడ్మిన్ కృష్ణయ్య, రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలి కవిత



హైదరాబాద్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, మాజీ మంత్రి హరీశ్ రావుతో లండన్ లో ఎలాంటి ఒప్పందం జరిగి ఉండకపోతే గత ప్రభుత్వంలో మంత్రి పదవిని అడ్డుపెట్టుకొని సొంత డెయిరీకి లాభం చేకూర్చిన హరీశ్ రావుపై క్విడ్ ప్రో కో కేసు నమోదు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు.

అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రభుత్వ రంగంలోని డెయిరీని కాదని తన సొంత డెయిరీ ద్వారా కార్పొరేట్ కాలేజీలు, సంస్థలు, హాస్పిటళ్లకు పాలు సరఫరా చేసి 8 ఏళ్లలో వందల కోట్ల వ్యాపారం చేయడం క్విడ్ ప్రో కో కాదా? హరీశ్ రావుతో మీకు లాలూచీ లేకపోతే వెంటనే 500 మంది విద్యార్థులు పైగా ఉన్న ప్రతి విద్యా సంస్థలకు ప్రైవేటు డెయిరీల ద్వారా కాకుండా ప్రభుత్వ, సొసైటీల ఆధ్వర్యంలో నడిచే డెయిరీల నుండి పాల సరఫరా చేసే విధంగా జీవో ఇవ్వాలని అన్నారు.

ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని 'ఆంధ్ర రేవంత్ రెడ్డి'అని అనాల్సిన పరిస్థితి వచ్చింది. తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్లు గా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారిని కాంగ్రెస్ ప్రభుత్వం నియమించింది. దిన్ని తెలంగాణ రక్షణ సేన తీవ్రంగా ఖండిస్తుంది. తక్షణం బ్రాహ్మణ పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్లు గా ఆంధ్రా ప్రాంతానికి చెందిన వారిని తొలగించి తెలంగాణ వారిని నియమించాలని ఆమె డిమాండ్ చేసారు.

బీఆర్ఎస్ ను హస్తగతం చేసుకునేందుకు గుంటనక్క కుట్ర చేస్తోంది. మెదక్ ఎమ్మెల్యేలతో రహస్య మంతనాలు.. కేసీఆర్ కు వెన్నుపోటు పొడిచే ప్రయత్నం జరుగుతోంది. అటు గుంపుమేస్త్రీ, ఇటు బీజేపీతో దోస్తానా? మంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రా వ్యాపార సంస్థలతో రూ. వేల కోట్ల పాల వ్యాపారం నడిపించారు. గుంటనక్క, గుంపు మేస్త్రీ మధ్య లండన్ లో లలూచీ జరిగింది. లండన్ మీటింగ్ వివరాలు ఒక్కొక్కటిగా టీఆర్ఎస్ బయటపెడుతుందని అన్నారు. అధికార కాంగ్రెస్ తో బీఆరెస్ పూర్తిగా కాంప్రమైజ్ అయిపోయింది. ఒడిశా అమ్మాయి చనిపోయిన సరే బీఆర్ఎస్ మాట్లాడటం లేదు. తెలంగాణకు అన్యాయం జరిగిన మాట్లాడటం లేదు. లండన్ లాలూచీ కారణంగానే బీఆర్ఎస్ మాట్లాడటం లేదా? కొన్ని రోజుల క్రితమే లండన్ లో గుంపుమేస్త్రీ, గుంటనక్క మధ్య మీటింగ్ జరిగిందని ఆరోపించారు.

గుంటనక్కకు చాలా వ్యాపార సంబంధాలు ఉండటం కారణంగానే మాట్లాడటం లేదు. ఇక ఆంధ్రావాళ్లతో కేటీఆర్ కు వ్యాపార సంబంధాలు, దోస్తులు ఉండటంతో ఆయన మాట్లాడటం లేదు. బీజేపీ తో మిలాఖత్ ఉందని నేను చెప్పటానికి నా దగ్గర ఆధారాలు ఉన్నాయి. రాజ్ పుష్ప ఓపెన్ స్కై విల్లాస్ లో ఒక ఆర్ఎస్ఎస్ ప్రముఖుడు వచ్చినప్పుడల్లా ఆయనకు పసుపు, మిరియాలు కలిపిన పాలు వెళ్తుంటాయి.ఆ రోజు హరీష్ రావు పూర్తిగా తన కార్యక్రమాలను రద్దు చేసుకోని ఆయనతో మీటింగ్ పెడతాడు. నేను ఇప్పుడు బీఆర్ఎస్ లో లేను. ఆ పార్టీ ఎలా పోయినా నాకు సంబంధం లేదు. కానీ తిన్నింటి వాసాలు లెక్కపెట్టే గుంటనక్క గురించి తెలియాలని చెబుతున్నానని అన్నారు.

# తెగిన పెనగలూరు చెరువు కట్టకు మరమ్మతులు చేయాలి

చిట్వేలి ఐదు సంవత్సరాల క్రితం అన్నమయ్య డ్యాం కొట్టుకుపోవడంతో ఆ వరద నీటి ప్రవాహంతో పెనగలూరు మండలంలో చెరువు కట్ట తెగిపోవడంతో, 1400 ఎకరాలు పంటలు సాగు లేకుండా బీడు పెట్టాల్సి వస్తోందని సిఐటియు రాష్ట్ర కౌన్సిల్ నాయకులు సిహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. గురువారం వరదల్లో కొట్టుకుపోయిన, చెరువు కట్టను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలోనూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరం అయినా, ఆ చెరువు కట్టకు పడిన గండి పూడ్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలాలకు నీరు వదిలే గేటు తూములు కూడా, శిథిలావస్థకు చేరుకొని పాడు పడ్డాయి అన్నారు. కట్టమీద ప్రయాణించే, 10 గ్రామాలు ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు అన్నారు. చెరువులో నీరు నిలువ లేకుండా పోవడంతో, చెరువు ఆక్రమణ గురై భూ కబ్జాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెండు పంటలు పండే చెరువు పైన వైసీపీ ప్రభుత్వం గాని, నేడు టిడిపి కూటమి ప్రభుత్వం, కానీ రైతుల పైన ఎంత శ్రద్ధ ఉందో దీన్ని బట్టి తెలుస్తుందని ఆరోపించారు. చెరువు మరమ్మతుల ఖర్చుల కోసం ఇరిగేషన్ అధికారులు వేసిన 8 కోట్ల రూపాయల ఎస్టిమేషన్లు సెక్రటేరియట్, సీఈ కార్యాలయంలో ఉన్నాయని, వీటిని గురించి పట్టించుకోలేదని తెలిపారు.

# ఆందోల్ నియోజకవర్గంలో జోరుగా కల్తీకల్లు దందా

### ప్రజల ప్రాణాలతో చెలగాటం
### ఆందోల్ నియోజకవర్గంలో పలు ప్రాంతాలలో కల్తీకల్లు విక్రయాలు
### కల్తీ కల్లు తయారీకి విచ్చలవిడిగా మత్తు పదార్థాల వినియోగం
### మామూళ్ల మత్తులో ఎక్సైజ్ శాఖ

ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :అక్రమ సంపాదనే లక్ష్యంగా అక్రమార్కుల దందా జోరుగా కొనసాగుతోంది,అల్లాదుర్గం మండలంలో జోరుగా కల్తీకల్లు విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి స్వచ్ఛమైన కల్లుకు బదులు ప్రాణాంతకమైన మత్తు పదార్థాలను కలుపుతూ, కృత్రిమ కల్లు తయారు చేస్తున్నారన్న,విమర్శలు వినిపిస్తున్నాయి, ధనార్జనె లక్ష్యంగా కొందరు వ్యాపారులు, కల్తీ కల్లు తయారు చేస్తూ, ప్రజల ప్రాణాలతో చెలగటం ఆడుతున్నారు,గీత కార్మికులకు శిక్షణ లేకుండా లైసెన్సులు ఇవ్వడం వల్ల నిజమైన కార్మికులకు అన్యాయం జరుగుతుందని విమర్శలు ఉన్నాయి, అల్లాదుర్గం మండలంలోని, సిల్వర్, కాగితంపల్లి,రాంపూర్,సీతానగర్, ముప్పారం, అల్లాదుర్గం, బహిరాన్ దీబ్బ, తదితర గ్రామాలలో కల్తీకల్లు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి,స్వచ్ఛమైన కల్లుకు బదులు, చెట్ల నుండి తీసిన కొద్దిపాటికల్లుతో




ప్రాణాంతకం మైన మత్తు పదార్థాలు కలుపుతూ,గ్రామీణ ప్రాంత ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నప్పటికీ, అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు, తూతూ మంత్రంగా తనిఖీలు చేయడం తప్ప, చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు,ఆల్ఫోజోలం, డైజోపామ్, వంటి రసాయనాలతో కల్లు తయారు చేయడం వల్ల, ఆ కల్లు తాగిన వాళ్లు మత్తులోకి వెళ్లిపోవడం, తద్వారా అనారోగ్య సమస్యలకు గురి కావడమే కాకుండా, ప్రమాదాలు కూడా జరుగుతున్న సందర్భాలు, అనేకం ఉన్నాయి, మోకాళ్ళ నొప్పులు, బుద్ధి మందగించడం, బీపీ షుగర్ లాంటి వ్యాధులకు గురయ్యే, ఆస్కారం ఉండడమే కాకుండా, మత్తులో ఏం చేస్తున్నారో వారికి తెలియని పరిస్థితి నెలకొంటుంది,కల్తీకల్లుతో ఎన్ని నష్టాలు కష్టాలు జరుగుతున్న,అధికారుల చర్యలు మాత్రం శూన్యమే,కల్లు సేవించే వారికి,పైనుండి డైజోఫామ్, క్లోరోఫామ్లు అధికంగా వేయడంతో, మత్తులో రోడ్డు ప్రమాదాలు,జరుగుతున్న సందర్భాలు అనేకం, ఇంట్లో గొడవలు పడి ఆత్మహత్యలు సైతం జరుగుతున్నాయి, ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు, టాస్క్ ఫోర్స్ అధికారులు, స్పందించి కల్తీకల్లు పై నిగా పెట్టి, కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

# ఆధ్యాత్మిక శోభతో విరజిల్లుతున్న పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం

### వైభవంగా పీఠాధిపతి శ్రీ 1008 శ్రీ విద్యాదిశ శ్రీపాదుల వారి 70వ జయంతోత్సవం...

శ్రీ వ్యాస రాయల వారి చే 15వ శతాబ్దం లో ప్రతిష్ఠింపబడి నేటికి పూజలందుకుంటున్న గద్వాల జిల్లా దారూర్ మండల పరిధిలోని పెద్ద చింతరేవుల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ఆధ్యాత్మిక కేంద్రంగా శోభాయానంగా మారింది. ఉడిపి ఫలిమారు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 విద్యా దీశ శ్రీపాదుల వారు స్వామిజి, శ్రీ 1008శ్రీ విద్యా రాజేశ్వర శ్రీపాదుల వారు ఆధ్వర్యంలో 48వ చాతుర్ మాస్య పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా స్వామీజీలు మూలరాముల సంస్థాన పూజలు నిర్వహించి, ఏక దశవిధ హారతులు శాస్త్రోక్తంగా సమర్పించారు. అనంతరం శ్రీ ఆంజనేయ స్వామికి ప్రత్యేక






పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనేకమంది భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

ఘనంగా స్వామీజీ పుట్టినరోజు వేడుకలు..

ఉడిపి పాలిమర్ మఠం పీఠాధిపతులు శ్రీ విద్యా దిశ శ్రీ పాదుల స్వామి వారి 70 పుట్టిన రోజు సందర్భంగా వేద పండితులచే శాంతి యాగం, హోమ పూజలు నిర్వహించి స్వామీజీకి భక్తులు పుష్పాభిషేకం,ముత్యాల కనకాభిషేకం నిర్వహించి స్వామి ఆశీస్సులు అందుకున్నారు. ఆంజనేయ అన్నప్రసాద ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో విశేషంగా వచ్చిన భక్తులకు 70 రకాల ఫలహారాలతో కూడిన అన్నప్రసాద పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు ఆద్య చక్రవర్తి కేశవాచార్యులు , మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి అర్చకులు పరిమళాచారి,అర్చకులు ఆర్య వామనాచారి, ఆద్య మద్వాచారి, ఆద్య కిష్టాచారి, దేవస్థాన చైర్మన్ గిరి రావు, ఉడిపి వేద పండితులు,వారి కుటుంబ సభ్యులు వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు, భక్తిశ్రద్ధలతో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# బ్రాహ్మణపల్లి వద్ద యాక్సిడెంట్.. కళ్యాణదుర్గం వాసులు ఇద్దరు మృతి

రాయదుర్గం-అనంతపురం హైవేపై బ్రాహ్మణపల్లి వద్ద గురువారం తెల్లవారుజాము 3 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కళ్యాణదుర్గానికి చెందిన నలుగురు కదూరు వెళ్లి కారులో తిరిగి వస్తుండగా అదుపు తప్పి పల్టీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాఘవేంద్ర గుప్త, నాగరాజు మరణించారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ప్రమాదంపై వివరాలు సేకరిస్తున్నారు

# కేలో ఇండియా డైలాగ్స్ కార్యక్రమం ఘనంగా నిర్వహణ...

**కూకట్పల్లి (ప్రజాబలం) ఆగస్టు 27:** కూకట్‌పల్లిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం ( ఎన్ ఎస్ ఎస్) క్రీడా విభాగం ఆధ్వర్యంలో "కేలో ఇండియా డైలాగ్స్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విద్యార్థులతో క్రీడల ప్రాముఖ్యతపై నిర్వహించిన వర్చువల్ సంభాషణను కళాశాల విద్యార్థులు వీక్షించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర, జాతీయ స్థాయిలో సైక్లింగ్ క్రీడలో అనేక పతకాలు సాధించిన సాయి చరణ్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై




విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. సైక్లింగ్‌లో తాను సాధించిన విజయాలు, ఎదుర్కొన్న సవాళ్లు, క్రీడల వల్ల కలిగే ప్రయోజనాలు విద్యార్థుల జీవితంలో క్రీడల ప్రాధాన్యతను వివరించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు అందిస్తూ వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సాయి చరణ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో క్రీడలకు ఆదరణ క్రమంగా పెరుగుతోందని,రాబోయే రోజుల్లో క్రీడలకు మరింత ప్రాధాన్యత లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా చురుకుగా పాల్గొని తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. చందన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైక్లింగ్ క్రీడాకారుడు సాయి చరణ్ యాదవ్ ని కళాశాల తరఫున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కరుణాకర్,ఎన్ ఎస్ ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ నాగుల వేణు, డాక్టర్ పద్మ, క్రీడల విభాగాధిపతి మహమ్మద్ జలీల్, ఏ. గోపాల్, ప్రవీణ్ కుమార్, మై భారత్ కార్యకర్తలు కుమార్, శ్రీధర్, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నోటీసెమొ రాకపోయే ! విచారణకేమొ వేలాయే ! ! ఏమి సేతురా రామా !



**గండిపేట మండలం ప్రజాబలం ప్రతినిధి 27 ఆగస్టు 2026** ఓటర్ జాబితా సవరణ 2026 (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) పై ప్రజల సూచనలు, అభ్యంతరాలు వ్యక్త పరచక ముందే, క్రొత్తగా ఓటు నమోదు చేసుకోవడానికి ఫారమ్ 6 భౌతికముగా అందజేయక, భౌతికముగా నోటీసులు జారీ చేయకుండా, శనివారం 29 ఆగస్టు రోజు నుండి విచారణ మొదలు పెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. భౌతికముగా ఫారమ్ 6, 7, 8 లు ఆగస్టు 17 నుండి ఇవ్వవలసి ఉండగా 10 రోజులు గడుస్తున్నా నేటికీ ఇవ్వకపోవటం అధికారుల నిర్లక్ష్యంనకు పరాకాష్టగా ఉన్నది. ఇట్టి విచారణలో సంతానం మధ్య 9 నెలల కంటే తక్కువ వయస్సు వ్యత్యాసం వుండకూడదని, తల్లి దండ్రులకు, సంతానానికి మధ్య 15 సంవత్సరాల వ్యత్యాసం వుండకూడదని, సంతాన సందర్భంగా తల్లి దండ్రులకు 50 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు వ్యత్యాసం వుండకూడదని, ఓటరుకు, తాతా మామ్మలకు మధ్య 40 సంవత్సరాల వయస్సు వ్యత్యాసం వుండకూడదని, ప్రస్తుత రోల్ మరియు చివరి ఓటర్ జాబితా సవరణలో తల్లిదండ్రుల పేరు వేరుగా ఉండటం. వేర్వేరు బంధువుల రకంతో (తండ్రి/తల్లి) మ్యాప్ చేయబడి ఉండటం. మొదట తండ్రిగా, చివరి ఓటర్ జాబితా సవరణలో భర్తగా మ్యాప్ చేయబడి ఉండటం వంటి కఠినతర నిబంధనలను పెట్టి: పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రం, విద్యా/ మెట్రిక్యులేషన్ ధృవీకరణ పత్రంలను జత పరిచమనీ ఒత్తిడి చేస్తున్నారు, లేదంటే ఓటు హక్కు కోల్పోతారని అధికారులు హెచ్చరిస్తున్నారు. అక్షరాస్యత శాతం అంతంత మాత్రమే ఉన్న మన రాష్ట్రంలో పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రంలు ఎక్కడ నుండి తెస్తారని, ఓటు సవరణ సమయంలో ఎన్నికల సంఘం ఉన్నతాధికారులు ప్రజలకు తెలిపిన విషయం ఒకరకంగా ఉండగా, క్రింది స్థాయిలో ప్రజలకు అందుబాటులో లేకుండా విచారణ పేరుతో మిగిలి ఉన్న కాస్తొ కూస్తొ ఓట్లను అంతం చేయడానికి చేస్తున్న ప్రయత్నంగా ఉన్నదని భారత రాష్ట్ర సమితి పార్టీ నాయకులు అందె లక్ష్మణ్ రావు, సుమనళిని, సింగదాసరి గణేష్, శ్రీ బాబు తదితరులు దుయ్యబట్టారు. గురువారం రోజున పుప్పలగూడ హరిజన బస్తీ, సంతోష్ నగర్ కమ్యూనిటీ హాల్ నందు బి.ఆర్.ఎస్ పార్టీ తరపున ఓటర్ల జాబితా సహాయ శిబిరం నిర్వహించడం జరిగిందని, శిబిరంనకు ప్రజా స్పందన బాగుందని, విచ్చేసిన ఓటర్లకు, ఓటు ముసాయిదాలో పేరు ఉందని మురిసి పోకుండా సంబందిత బూత్లెవల్ అధికారులను కలసి నోటీస్ విషయమై సమాచారం తెలుసుకోండని, బాధ్యతగా ఉండండని, ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండని ప్రజలను నిర్వాహకులు కోరడమైనది.

# డీసీఎం ఢీకొని భార్యాభర్తలు మృతి



**జహీరాబాద్, ఆగస్టు 27 ప్రజాబలం ప్రతినిధి:** డీసీఎం వాహనం ఆటోను ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందిన ఘటన కోహిర్ మండలంలో గురువారం చోటుచేసుకుంది. కోహిర్ ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని సజ్జాపూర్ శివారులో పిచ్చేర్యాగడి--సజ్జాపూర్ రోడ్డుపై చెరువు సమీపంలో ఆటోను డీసీఎం వాహనం వేగంగా ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు అదుపుతప్పిన డీసీఎం ఆటోపై పడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న బేగరి పద్మమ్మ, ఆమె భర్త రాచయ్య తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం అందుకున్న కోహిర్ పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై నరేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

## సమయపాలన పాటించని ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది

బేతంచెర్ల మండల కేంద్రంలోఉన్న మండల ప్రజా పరిషత్ కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించకుండా యదేచ్చగా,ఎలాంటి భాధ్యత లేకుండా వ్యవహరిస్తూ తమ విధులకు ఇష్టం వచ్చినట్లుగా హాజరవుతున్నారు. ఎంపీడీవో కార్యాలయానికి మండలంలోఉన్న వివిధ గ్రామాల ప్రజలు వందలాది మంది ఇక్కడికి వచ్చి తమ సమస్యలను సంబంధిత అధికారులకు వివరిస్తే పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఆశతోఇక్కడికి వస్తుంటారు. కానీ ప్రజలనుకున్న విశ్వాసాన్ని కిందిస్థాయి సిబ్బందితో పాటు ఉన్నతాధికారి సైతం వారి ఆశల్ని అడియాశలు చేస్తున్నారు తప్పితే ఎలాంటి సమస్యలు పరిష్కరించకుండా కాలయాపన చేస్తున్నారు. ఇక్కడ పనిచేసే సిబ్బందితోపాటు సాక్షాత్తు ఎంపీడీవో కూడా ఎప్పుడు అందుబాటులో ఉండకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసి,తమ స్వలాభం కోసమే ఉన్నట్లుగా ఉన్నారని మండల ప్రజలు బహిరంగంగా చర్చించుకోవడం గమనార్హం. కావున ఇక నుండి అయినా ప్రతి రోజు బేతంచర్ల ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సమయపాలన పాటించి,ప్రజా సమస్యలను, ఎప్పటికప్పుడు పరిష్కరించి,మండలాన్ని అభివృద్ధి చేసే విధంగా పని చేయాలని, సంబంధిత ఉన్నతాధికారులు,ఇక్కడ పని చేస్తూ,సమయపాలన పాటించని ఎంపిడిఓ కార్యాల సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

# గిరిజన క్రీడలను ప్రారంభించిన డిప్యూటీ డైరెక్టర్ ఎం. ఫిరంగి



ఖమ్మం జిల్లా బ్యూరో ఆగస్టు27 ప్రజాబలం:జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను బస్వాపురం గిరిజన బాలికల పాఠశాలలో డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఫిరంగి ప్రారంభించారు. అనంతరం జిల్లా క్రీడా అధికారి ఎన్.శంకర్రావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ ఏం.ఫిరంగి మాట్లాడుతూ ఐటిడిఏ భద్రాచలం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉద్యోగులు ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు నిర్వహించి ఉపాధ్యాయుల్లోని క్రీడా నైపుణ్యాలను విద్యార్థులకు అందించడానికి పోటీలు దోహదం చేస్తాయని ఆయన తెలిపారు. ఐటీడిఏ స్థాయిలో కిన్నెరసాని క్రీడా పాఠశాలలో 29,30 తేదీలు జరగనున్నట్లు ఆయన తెలిపారు. క్రీడల్లో మంచి ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులకు నగదు ప్రోత్సాహకాలు ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ బి. రాహుల్ ఐఏఎస్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. ఈ క్రీడల్లో జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయులు ఉద్యోగులు మొత్తం 60 మంది పాల్గొన్నారు. వాలీబాల్, క్రికెట్, షటిల్, క్యారమ్స్, చెస్, షార్ట్పిట్, విభాగాల్లో పోటీలు నిర్వహించినారు. ఈ కార్యక్రమంలో వైరా ఖమ్మం ఏటీడీఓ పి. రమేష్,ఖమ్మం ఏసీఎంవో ఎల్.రాములు వివిధ పాఠశాలల హెచ్ఎంలు శ్రీనివాసరావు, పీడీలు వి. ప్రసాద్, బి.నెహ్రూ,బి. సక్రం, పిఈటిలు జె. రామారావు, బి.సుస్మిత, సతీష్, సీతారాం, శ్రీరామ్, శ్రీనివాస్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు డిఎస్. నాగేశ్వరరావు,బి.రాందాస్, ఎం.బాల్ సింగ్, బి.గోపీనాథ్, బి.భావచంద్, శంకర్, ఎస్. రమేష్, డి.సేన, శ్రీనివాసరావు, రాజేశ్వర్ రావు, సేన, చంద్రయ్య, శివ,అన్నపూర్ణ, తిరుమల,నిర్మల,తార, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే. పై ములుగులో MPSO ఎం పి ఎస్ ఓ లు, ఏ ఈ ఓ లకు శిక్షణ కార్యక్రమం



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 ములుగు గురువారం ఉదయం 11.30 గంటలకు ములుగు రైతు వేదికలో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు

ఈ సందర్భంగా డి ఐ ఎస్ ఓ శ్రీ యు లక్ష్మీనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పి పి టి ద్వారా డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే నిర్వహణపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించారు.

క్షేత్రస్థాయిలో పంటల సాగు పరిస్థితులను పరిశీలించడం, వివిధ పంటల సాగు విస్తీర్ణాన్ని ఖచ్చితంగా గుర్తించడం, పంటల వివరాలను సేకరించడం, దిగుబడి అంచనాలకు సంబంధించిన సమాచారాన్ని నమోదు చేయడం, సర్వేలో ఉపయోగించే డిజిటల్ విధానాన్ని సమర్థవంతంగా వినియోగించడం వంటి అంశాలను వివరించారు.

సర్వేలో భాగంగా క్షేత్రస్థాయిలో సేకరించే ప్రతి వివరాన్ని సమయపాలనతో, పారదర్శకంగా, ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా డిజిటల్ విధానంలో నమోదు చేయాల్సిన అవసరాన్ని ఆయన వివరించారు. పంటల రకం, సాగు విస్తీర్ణం, పంట పరిస్థితి, దిగుబడి అంచనాలకు సంబంధించిన వివరాలను వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలని సూచించారు. డేటా నమోదు సమయంలో మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, అనుమానాలు లేదా సాంకేతిక సమస్యలు ఎదురైతే సంబంధిత ఉన్నతాధికారుల సూచనలు తీసుకోవాలని తెలిపారు.

ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీ భానోతు జవహర్ లాల్ మాట్లాడుతూ, వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రభుత్వ విధానాలు, ప్రణాళికలు, అభివృద్ధి కార్యక్రమాలకు నమ్మకమైన వ్యవసాయ గణాంకాలు ఎంతో కీలకమని అన్నారు. క్షేత్రస్థాయిలో సేకరించే సమాచారం ఎంత ఖచ్చితంగా ఉంటే, జిల్లాలో వ్యవసాయ రంగానికి సంబంధించిన ప్రణాళికలు మరియు విధానాల రూపకల్పన అంత సమర్థవంతంగా ఉంటుందని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి సర్వేను విజయవంతంగా పూర్తి చేయాలని మరియు ఫారం-1 ‌ ఫారం-2 నిర్ణత సమయం లో ఆన్ లైన్ నమోదు చేయాలి ల్యాప్స్ కాకుండా చూడాలని సూచించారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో, ఎస్ ఓ శ్రీ భూక్య లాల్ నాయక్, డి ఐ ఎస్ ఓలు శ్రీ ప్రదీప్ కుమార్, శ్రీ జి. శ్రీనివాస్, ఎం పి ఎస్ ఓ లు, ఏ ఇ ఓ లు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# చిన్నబోయినపల్లి పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు




ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 ఏటూరు నాగారం ఏటూరు నాగారం మండల కేంద్రంలోని చిన్న బోయినపల్లి లో డీఎన్టీయూపీఎస్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన

ఈ కార్యక్రమంలో బైరెడ్డి మల్లారెడ్డి, గంటా కృష్ణారెడ్డి, కోడం గౌతమ్‌తో పాటు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కవిత, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా విద్యార్థులు పరస్పరం రాఖీలు కట్టుకుని రక్షాబంధన్ పండుగ విశిష్టతను తెలియజేశారు. సోదరభావం, ఆత్మీయత, పరస్పర ప్రేమను పెంపొందించేలా వేడుకలను నిర్వహించారు. పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించడంపై విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి... టీజీవో జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ నోరి







రంగారెడ్డి ప్రజాబలం ప్రతినిధి: పి ఆర్ సి ప్రకటించాలని , కరువు భత్యం బకాయిలు మంజూరి చేయాలని, నూతన ఆరోగ్య భీమా పథకం సమర్థవంతంగా అమలు చేయాలని మరియు ఇతర పెండింగ్ డిమాండ్ల పరిష్కారం కోరుతూ ఈ రోజు తెలంగాణ ఉద్యోగుల , ఉపాధ్యాయుల , పెన్షనర్ ల జాయింట్ యాక్షన్ కమిటి పిలుపు మేరకు ఇందిరాపార్క్ దగ్గర జరిగిన ధర్నా కార్యక్రమంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేసినట్లు TGO అధ్యక్షుడు డాక్టర్ రామారావు, కార్యదర్శి శ్రీనేష్ కుమార్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు .

ప్రజాప్రభుత్వం గా చెప్పుకుంటున్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం , ప్రజలలో భాగమైన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా తాత్సార్యం చెస్తూ ఉద్యోగులను తీవ్ర అశాంతికి గురిచేస్తుందని అయన అన్నారు.

ముఖ్యమంత్రి గారి సూచన మేరకు ఉప ముఖ్యమంత్రి గారైన భట్ట విక్రమార్క క్యాబినెట్ సబ్ కమిటీని , నవీన్ మిట్టల్, IAS అధికారుల కమిటీని, మంత్రులను ఎన్నో సార్లు కలిసినా సమస్యల పరిష్కారం కావడం లేదని దీనిపై ఉద్యోగుల రాష్ట్ర ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని అయన అన్నారు . TGEJAC ఇచ్చిన పిలుపుమేరకు ఇందిరాపార్క్ వద్ద జరిగిన మహా ధర్నా కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర చైర్మన్ మారం జగదీశ్వర్ మాట్లాడుతూ ఉద్యోగులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా మనుగడ సాధించలేదని, ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం పెండింగులో ఉన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించకుంటే భవిష్యత్ లో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటకట్టుకొనే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. TGE-JAC సెక్రెటరీ జనెరల్ శ్రీ ఏలూరి శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, PRC అమలు, D .A. బకాయిల కొరకు ప్రభుత్వానికి ఎన్ని సార్లు చెప్పినప్పటికీ చలనం లేదని, ఈరోజు జరిగిన ధర్నా ప్రభుత్వానికి ఒక గట్టి హెచ్చరిక అని , ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తమ డిమాండ్లను ఒప్పుకోకుంటే , భవిష్యత్తులో తాము తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు.

ఈ సమావేశంలో నూతనకంటి వెంకట్, శాంతి శ్రీ, సైదమ్మ, అనిత, రాకేష్, మహేశ్వరి, మసూద్ ఆలీ, నరేందర్, రోజా, శ్రీనివాస్, మహేష్ మరియు జెఏసి భాగస్వామ్య సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ ఏటూరునాగారం ప్రాజెక్ట్ ఆఫీసర్ శ్రీ లెనిన్ వత్సల్ టోప్పో ఐఏఎస్



ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 తాడ్వాయిశ్రీ సమ్మక్క సారలమ్మ తాడ్వాయి మండలం, కాటాపూర్ లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐటీడీఏ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీ లెనిన్

– ఆసుపత్రి వార్డులోని ఇన్‌పేషెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేసి, ప్రతిరోజూ చేరుతున్న రోగులను మరియు రిజిస్టర్‌లో నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. రికార్డుల కోసం అన్ని రిజిస్టర్లను ప్రతిరోజూ అప్‌డేట్ చేయాలని మరియు వార్డును శుభ్రంగా, చక్కగా ఉంచాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.



– రోగుల సహాయకులతో మాట్లాడి, వారి నివాస ప్రాంతం, నమోదైన కేసులు, డాక్టర్ మరియు సిబ్బంది లభ్యత గురించి ఆరా తీశారు. దోమల నివారణకు నివాస ప్రాంతాలలో ఇండోర్ రెసిడ్యువల్ స్ప్రేయింగ్ (ఐ ఆర్ ఎస్ చేస్తున్నారా అని విచారించి, అన్ని నివాస ప్రాంతాలలో ఐ ఆర్ ఎస్ కవరేజీని నిర్ధారించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

– మందుల నిల్వ గదిని తనిఖీ చేసి, మందులపై తయారీ మరియు గడువు తేదీలను పరిశీలించారు. అన్ని మందులను సరైన పద్ధతిలో వేరు చేసి, స్వీకరించిన మరియు పంపిణీ చేసిన స్టాక్ వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

– సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, అందరూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం/క్షేత్రస్థాయిలో సిబ్బంది విధి నిర్వహణ సమయంలో సమయపాలన పాటించేలా చూడాలని ఆదేశించారు.

– ఫార్మసీని తనిఖీ చేసి, రోగులకు మందుల పంపిణీని పరిశీలించి, రోగులకు మందులు పంపిణీ చేసేటప్పుడు సరిగ్గా తనిఖీ చేయాలని, రోగి రికార్డులను సరిగ్గా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ సమయంలో డాక్టర్ స్నిగ్ధ ఎంఎల్‌హెచ్‌పి, ఆరోగ్య విస్తరణ అధికారి మరియు సిబ్బంది వెంట ఉన్నారు.

## కడప ఎంపీ అవినాష్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

బద్వేలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా గురువారం బద్వేలు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాశినాయన మండలం ఓబులాపురం వద్ద ఉన్న వివేకానంద సేవా సమితి ఆశ్రమంలో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి అవినాష్ రెడ్డి కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అవినాష్ రెడ్డి ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవిస్తూ ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. అనంతరం పార్టీ రాష్ట్ర డాక్టర్ల విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి ఆధ్వర్యంలో ఆశ్రమంలోని అనాథలకు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ డీసీ గోవింద్ రెడ్డి స్వయంగా అన్నం వడ్డించారు. అలాగే టేకురుపేట సర్పంచ్, మాజీ సర్పంచ్ కల్లూరి రమణారెడ్డి గారు రూ.10,000/- విరాళాన్ని ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి చేతుల మీదుగా ఆశ్రమం చైర్మన్ గారికి అందజేశారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం ద్వారా వైయస్ అవినాష్ రెడ్డి పట్ల ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త కల్లూరి రమణారెడ్డి, నియోజకవర్గంలోని పలు ప్రజా ప్రతినిధులు కలసపాడు జడ్పిటిసి గురువి రెడ్డి, ఎంపీపీ నిర్మల నారాయణ, మాజీ ఎంపీపీ రామకృష్ణారెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు సీఎం భాష, సుదర్శన్, వైస్ ఎంపీపీ రాజశేఖర్ ,రాష్ట్ర జిల్లా అనుబంధ విభాగాల నాయకులు చిత్త రవి ప్రకాష్ రెడ్డి, రాజీవ్ భాషా, చాపాటి లక్ష్మీనారాయణ రెడ్డి, చిత్తా రాజశేఖర్ రెడ్డి, చిత్తాగిరి ప్రణీత్ రెడ్డి, తులసి సురేష్, మధుసూదన్ రెడ్డి, జయన్న, చాపాటి సాయి నారాయణ రెడ్డి , సూర్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## ఓటరు వివరాల్లో తప్పులుంటే గ్రామసభలోనే తెలియజేయాలి

### మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి




**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం, ఆగస్టు 27:** ఓటర్లు తమ ఓటరు వివరాలను పరిశీలించి, ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే గ్రామసభల ద్వారా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి సూచించారు.

గురువారం శామీర్‌పేట్ మండలం శామీర్‌పేట్ గ్రామంలో నిర్వహించిన ఓటరు సవరణ ప్రక్రియకు సంబంధించిన గ్రామసభకు కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలను పూర్తి పారదర్శకతతో, నిబంధనల ప్రకారం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఓటరు సవరణకు సంబంధించి ప్రజలకు ఉన్న సందేహాలను గ్రామసభల్లోనే నివృత్తి చేసుకోవాలని సూచించారు.

2002 ఓటరు జాబితా వివరాలతో ప్రస్తుత వివరాలను సరిచూస్తున్నామని, ప్రజలు సమర్పించిన నమోదు పత్రాల్లో 2002 నాటి వివరాలు లేకపోయినా, చిన్నచిన్న సవరణలు అవసరమైనా సంబంధిత పత్రాలను పరిశీలించి నిబంధనల ప్రకారం సవరణలు చేపడతామని కలెక్టర్ తెలిపారు.ప్రతి పోలింగ్ కేంద్రానికి సంబంధించిన బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి అవసరమైన సమాచారాన్ని అందిస్తారని, ఓటర్లు తమకు సంబంధించిన పత్రాలను అందజేసి అధికారులకు సహకరించాలని కోరారు. ఓటరు సవరణకు సంబంధించి సూచించిన 11 రకాల పత్రాల్లో తమ వద్ద అందుబాటులో ఉన్న పత్రాలను బూత్ స్థాయి అధికారులకు అందజేస్తే, తుది ఓటరు జాబితా ప్రచురణ సమయంలో ఓటర్లతో పాటు వారి కుటుంబ సభ్యుల పేర్లు కూడా సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.కొంతమంది ఓటర్లు ప్రస్తుత ఫొటోలను నవీకరించలేకపోతున్నామని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, తుది జాబితాలో ఫొటోలను సవరించే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు.

కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు లిఫారం--6, మరణించిన వ్యక్తుల పేర్లను తొలగించేందుకు లిలిఫారం--7, పేరు, ఫోన్ నంబర్, చిరునామా తదితర వివరాల్లో మార్పులు చేసుకునేందుకు లిఫారం--8 వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఓటరు వివరాల సవరణ నిరంతర ప్రక్రియగా కొనసాగుతుందని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన

అనంతరం కలెక్టర్ సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఎంతమంది చిన్నారులు ఉన్నారు, వారికి సరైన పౌష్టికాహారం అందుతోందా అనే విషయాలను అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఎత్తుకు తగిన విధంగా బరువు ఉండేలా పౌష్టికాహారం అందించాలని సూచించారు. చిన్నారుల బరువు తగ్గకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.

అంగన్‌వాడీ కేంద్రంలోని చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించి వారి పరిస్థితులను తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో కీసర ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, శామీర్‌పేట్ తహసీల్దార్, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## రామగుండంలో 30వేల ఓట్ల గల్లంతు

### ఓటు హక్కును కాపాడుకోవడం మన బాధ్యత : మేయర్ మహంకాళి స్వామి

**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్టు-27, ప్రజాబలం ప్రతినిధి:**మన ఓటు - మన హక్కు, మన హక్కుని కాపాడుకోవడం మన భాధ్యతని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. సర్ ప్రక్రియ లో భాగంగా గురువారం వివిధ డివిజన్లలో నిర్వహించిన వార్డు సభల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 47వ డివిజన్ చంద్రబాబు కాలనీలో నిర్వహించిన వార్డు సభలో ఆయన మాట్లాడుతూ రామగుండం నియోజకవర్గంలో 2,13,990 ఓట్లు ఉంటే, ముసాయిదా ఓటరు జాబితాలో 1,83,233 ఓటర్ల పేర్లు మాత్రమే ప్రచురితమయ్యాయని దాదాపు 30 వేల ఓట్లు గల్లంతయ్యాయని అన్నారు. నో మ్యాపింగ్ కింద 5,500 మందికి, అనామలీస్ కింద అంటే పేర్లలో అక్షర దోషాలకు సంబంధించి 49,034 మందికి, అంతా కలిపి దాదాపు 55 వేల మంది ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయని అన్నారు. ఈ నోటీసులకు ఆధారంగా అవసరమైన డాక్యుమెంట్లు సమర్పించి ఓటు కాపాడుకోవాలని అన్నారు. అలాగే సెప్టెంబర్




16, 2026 నారికి 18 సంవత్సరాలు నిండిన వారు ఫారం - 6 ఇచ్చి కొత్త ఓటర్ గా నమోదు చేసుకోవాలని అన్నారు. ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం - 7 , ఇతర వివరాలలో తప్పులు ఉంటే ఫారం - 8 పూర్తి చేసి ఇవ్వాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే బి ఎల్ ఓ లను ,వార్డు అధికారులను సంప్రదించాలని అన్నారు. స్పందించకుంటే తనకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్క ఓటు కూడా తప్పి పోకుండా పకడ్బందీగా ఈ ప్రక్రియ పూర్తి చేయాలని అన్నారు.

అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీ మాట్లాడుతూ సర్ నోటీసులను ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం చేయవద్దని కోరారు. నోటీసులు అందిన ప్రతి ఒక్కరు, అందులో పేర్కొన్న తేదీ మరియు సమయానికి విచారణాధికారి (హియరింగ్ ఆఫీసర్) ముందుకు హాజరుకావాలని అన్నారు.

ఈ సభలో స్థానిక కార్పొరేటర్ దాసరి సాంబమూర్తి , రామగుండం మండల తహశీల్దార్ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించాలి

### సుదర్శన్ రావు తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు

**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 ఏటూరు నాగారం** ఏటూరునాగారం:- ఏటూరునాగారం కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ రోజున రైతు సంఘం విస్తృత స్థాయి సమావేశం ఎండిగపూర్ పాషా అధ్యక్షతన జరిగింది.

ఈ సమావేశంలో మొదట ఇటీవల మరణించిన సారంపల్లి మల్లారెడ్డి రైతు సంఘం ఆలిండియా ఉపాధ్యక్షుడు కి మొదట సమావేశం సంతాపం తెలిపింది.అనంతరం జరిగిన సభలో పోతినేని సుదర్శన్ రావు గారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గత 12 సంవత్సరాల నుండి రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ మూడు






వ్యవసాయ చట్టాలు తెచ్చినాడు ఈ చట్టానికి వ్యతిరేకంగా రైతులు 385 రోజులు పోరాటం చేసి నల్ల చట్టాలను వెనుక గొట్టడం జరిగింది .అయినా దొడ్డి దారిన ప్రైవేటు విత్తన చట్టం తెచ్చి విత్తనాలపై రైతులకు కాకుండా కార్పొరేట్ శక్తులకు లాభం చేకూర్చే విధంగా చట్టాలు మార్చారని అంతే కాకుండా కేంద్ర ప్రభుత్వం నూతన వాణిజ్య విధానం పేరుతో అమెరికా, కెనడా, న్యూజిలాండ్ దేశంలోకి విదేశీ వ్యవసాయ ఉత్పత్తులు బార్ల తలుపులు తెరిచి 52 శాతం వ్యవసాయ రంగం పై ఆధారపడ్డ మన దేశ వ్యవసాయ రంగాన్ని కూలీలను బలి పశువులు చేయడం కోసం చట్టాలు తెచ్చారని దీనికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు.తెలంగాణ రైతు సంఘం రాష్ట్రంలో అనేక రైతు వ్యతిరేక విధానాల కు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించామని పేర్కొన్నారు తెలంగాణ రాష్ట్రంలో 36వ అఖిలభారత మహాసభలు నల్లగొండ జిల్లాలో నవంబర్ 15 నుండి 18 వరకు జరగనున్నాయని ఈ మహాసభల జయప్రదానికి రైతులందరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో రైతు సంఘం సీనియర్ నాయకులు సూడి కృష్ణారెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు, తుమ్మల వెంకట్ రెడ్డి రైతు సంఘం జిల్లా కార్యదర్శి, ఎండి దావూద్ , వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి, తీగల ఆదిరెడ్డి.చిట్టెం ఆదినారాయణ. వడకాపురం సారయ్య. ఎండి యాకూబ్.బండారి నరసింహులు. ఎల్పి ముత్యాలు. మంచాల రామారావు.గుండు రామస్వామి తదితరులు పాల్గొన్నారు

## అమ్మా నాన్న లేని పిల్లలతో రాఖీ వేడుకలు

### తబితా ఆశ్రమంలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు : ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ

**పెద్దపల్లి/గోదావరిఖని, ఆగస్ట్27, ప్రజాబలం ప్రతినిధి :** రామగుండం పట్టణంలోని తబితా అనాథ ఆశ్రమంలో గురువారం రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమి పండుగ సందర్భంగా ఆశ్రమ పిల్లల మధ్య ఈ వేడుకలు నిర్వహించి పిల్లలందరికీ రాఖీలు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షులు మద్దెల దినేష్ మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండుగ అని, అమ్మా నాన్న లేని





పిల్లలకు అండగా నిలబడి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న తబితా ఆశ్రమ నిర్వాహకులు వీరేంద్ర నాయక్ సేవలు అభినందనీయమని కొనియాడారు. పిల్లలందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలకు ఎదిగి దేశానికి సేవ చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్, ఏఐటియుసి సీనియర్ నాయకులు ఎం.ఎ. గౌస్ పాల్గొని పిల్లలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. పిల్లలు వారికి రాఖీలు కట్టి సంతోషం వ్యక్తం చేశారు.

## రక్షాబంధన్ సందర్భంగా రాఖీల కోసం బారులు తీరిన మహిళలు





**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి ఆగస్టు 27 ఏటూరునాగారం**ఏటూరు నాగారం మండల కేంద్రంలో. రాఖీ పండుగ సందర్భంగా రాఖీల కొనుగోలు కోసం బారులు అక్కలు చెల్లెలు ముఖ్యంగా రాఖీ పండగ అంటేనే పవిత్ర బంధం రక్త సంబంధాలు అక్క తమ్ముడు అన్న చెల్లె ల మధ్య ఉన్న పవిత్ర రక్త సంబంధాలే కాకుండా మంచి మనసుతో బంధాన్ని అల్లుకునే సమయం రాఖీ పండుగ పవిత్రమైన బంధాల మధ్య ఏర్పడ్డ ఈ రాఖీ పండుగ వంద సంవత్సరాలు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో కుటుంబ సమేతంగా తులతూగాలని కోరుకుంటూ తమ్ములకు అన్నలకు కట్టే రాఖి రక్త సంబంధాన్ని తెలియజేస్తుంది దీనితో ఆ కుటుంబం అంతా సంతోషంతో గడుపుతూ అన్నదమ్ముల మధ్య అక్కచెల్లెళ్ల మధ్య ప్రేమను పించే పండగే రక్షాబంధన్ ఈ పండుగ ప్రతి ఇంట్లో కుటుంబ సమేతంగా జరుపుకుంటూ సంతోషాన్ని కలుపుతారు

## దార్లపల్లి ఎస్ ఐ ఆర్ పై వార్డుసభ్యుల సమావేశంలో పాల్గొన్న గ్రామ సర్పంచ్ దుర్గమ్మ బాల్ రాజు




**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి ఆగస్టు 27 (ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం దార్లపల్లి గ్రామంలో ఎస్ ఐ ఆర్ సర్వే ప్రకారం 99% వివరాలు పూర్తిస్థాయిలో సేకరించడం జరిగిందని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు తెలిపారు గ్రామంలో మొత్తానికి రెండు పేర్లు ఐడి ప్రూఫ్ సరిగా సరిచేసి ఇవ్వనందున నేమ్స్ చూపించడం జరిగిందని తెలిపారు ఆ పేర్లునూ సరిచేసిమళ్లీ ఒక పేరు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు గ్రామంలో పూర్తిస్థాయిలో అన్ని వార్డు సభ్యుల పేర్లు సరిగ్గా అప్లికేషన్ చేయడం వల్ల పూర్తిస్థాయిలో 100% గ్రామంలో విజయవంతంగా ఎస్ ఐ ఆర్ సర్వే పూర్తి చేయడం జరిగిందని గ్రామ సర్పంచ్ తలారి దుర్గమ్మ బాల్ రాజు తెలిపారు కార్యక్రమంలో ఉప సర్పంచ్ మరియుగ్రామ సెక్రెటరీ మరియు అంగన్వాడి టీచర్ మరియు వార్డు మెంబర్స్ మరియు గ్రామ పెద్దలు సమావేశంలో పాల్గొని సమావేశం విజయవంతం చేయడం జరిగిందని తెలిపారు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com